
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 13 జనవరి 2025



మార్కెట్‌కు సంక్రాంతి శోభ


జగదాంబ జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ

కొనుగోలుదారులతో రద్దీగా మారిన దుకాణాలు

- ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపించిన నగరం
- పెద్దఎత్తున జనం తరలిరావడంతో కిక్కిరిసిన వాణిజ్య ప్రాంతాలు
- రహదారులపై బారులు తీరిన వాహనాలు

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):
నగరానికి సంక్రాంతి శోభ వచ్చింది. నగరవాసుల షాపింగ్ ఆదివారం కూడా కొనసాగింది. సోమవారమే భోగి పండగ కావడంతో మార్కెట్‌కు పోటెత్తారు. దీంతో వాణజ్య ప్రాంతాలైన పూర్ణామార్కెట్, జగదాంబ జంక్షన్, డాబాగార్డెన్స్, ద్వారకానగర్, ఆశీల్‌మెట్ట ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపించాయి. వస్త్ర దుకాణాలు, సంక్రాంతి పండగరోజు పూజకు అవసరమైన సామగ్రిని విక్రయించే మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో జనమంతా రోడ్లపైనే నిలబడాల్సి రావడం, వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు దుకాణాల వద్ద స్థలం లేకపోవడంతో రోడ్లపైనే నిలిపేసి షాపింగ్‌కు వెళ్లిపోయారు. దీనివల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తడంతో కూడళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. కనుచూపుమేర రోడ్లపై వాహనాలు బారులు తీరి ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపించింది. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం పోలీసులకు తలకు మించిన భారంగా పరిణమించింది. అలాగే సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లేవారి సంఖ్య ఆదివారం నాటికి మరింత పెరగడంతో ద్వారకానగర్ బస్‌స్టేషన్ ప్రయాణికులతో నిండిపోయింది. ఆ పరిసరాలన్నీ జనంతో నిండిపోవడంతో రహదారులపై వాహన రాకపోకలు గంటలకొద్దీ స్తంభించాయి. విజయనగరం, సాలూరు, పార్వతీపురం, శ్రీకాకుళం, పలాస, అనకాపల్లి, నర్సీపట్నం తదితర ప్రాంతాల బస్సులు ప్లాట్‌ఫారంపైకి రావడమే తరువాయి సీట్ల కోసం ఫీట్లు చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులతో ప్రయాణాలు చేసేవారి అవస్థలు వర్ణనాతీతం.


ప్రయాణికులతో రద్దీగా ఉన్న ఆర్టీసీ ద్వారకాకాంప్లెక్స్



బస్సులు కిటకిట

- 405 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్న ఆర్టీసీ

ద్వారకా బస్‌స్టేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):
సంక్రాంతి ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు, కాంప్లెక్సులు, బస్‌స్టేషన్లు రద్దీగా మారాయి. భోగి నాటికి తమ స్వస్థలాలకు చేరుకోవాలన్న ఉద్దేశంతో అధిక శాతం మంది ఆదివారమే ప్రయాణమవడంతో రద్దీ సంతరించుకుంది. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. షెడ్యూల్ సర్వీసులన్నీ 95 శాతానికి మించిన ఆక్యుపెన్సీ రేషియో నడుస్తున్నాయి. అయినప్పటికీ ప్రయాణికుల డిమాండ్‌కు తగ్గట్టుగా లేకపోవడంతో విశాఖ రీజియన్ అధికారులు 405 ప్రత్యేక సర్వీసులు నడిపారు. ద్వారకాకాంప్లెక్స్, మద్దిలపాలెం బస్‌స్టేషన్‌లలోని అన్ని ప్లాట్‌ఫాంలో ఒకదాని వెంట ఒకటి నిలిపి అన్ని ప్రాంతాలకు బస్సులు అందుబాటులో ఉంచారు. సిటీ ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్ లగ్జరీ సర్వీసులు, గ్యారేజీలో స్పేర్ సర్వీసులు ఆపరేట్ చేశారు. రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, ద్వారకాబస్‌స్టేషన్ మేనేజర్ రాజు బస్సులను, ట్రాఫిక్‌ను నియంత్రించారు.

దూరప్రాంతాలకు మరిన్ని...

షెడ్యూల్ సర్వీసుల సామర్థ్యానికి మించి ప్రయాణికుల డిమాండ్ ఉండటంతో ప్రత్యేక సర్వీసులు నడిపారు. హైదరాబాద్‌కు 24, విజయవాడకు 40, రాజమండ్రికి 25, కాకినాడకు 25, భీమవరం 4, అమలాపురం 4 సర్వీసులు నడిచాయి. జోన్ పరిధిలోని శ్రీకాకుళానికి 100, పలాసకు 30, పార్వతీపురానికి 40, సాలూరుకు 30, విజయనగరం 50, రాజాం 15, ఇచ్ఛాపురం 10, టెక్కలి 5, పాతపట్నం 3 ప్రత్యేక ... మిగతా 4వ పేజీలో



ఆర్టీసీ కాంప్లెక్స్- రామాటాకీస్ రోడ్డుపై బారులు తీరిన వాహనాలు

గుంతల రోడ్లకు సెలవిక!

రహదారులను అందంగా తీర్చిదిద్దిన కూటమి సర్కారు

- సంక్రాంతికి పూడ్చివేస్తామని ముందుగానే ప్రకటన
- అధికారంలోకి వచ్చిన వెంటనే కార్యాచరణ
- జిల్లాలో మూడొంతుల రోడ్లపై పూర్తైన పనులు
- తుఫాన్ కారణంగా మిగిలినవి ఈ నెలాఖరుకు పూర్తి

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి):
'సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేందుకు బయలుదేరిన ప్రజలంతా గోతుల రోడ్లపై ప్రయాణం నరకమనే భయాందోళన నుంచి బయటపడాలి. ఇందుకోసం తగిన కార్యాచరణ సిద్ధం చేసి, పండగ సమయానికి గోతులన్నీ పూడ్చివేయాలి. ఇందుకోసం నిధులు మంజూరు చేస్తున్నామని రెండు నెలలు కిందట ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రోడ్లు, భవనాలశాఖ సమీక్ష సందర్భంగా ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలో దాదాపు మూడొంతుల రహదారులపై గుంతలను అధికారులు ఇప్పటికే పూడ్చివేసి, ప్రయాణ కష్టాలను దూరం చేశారు. మరికొన్ని చోట్ల ఇటీవల తుఫాన్ కారణంగా కొంతవరకు పెండింగ్‌లో పడిన పనులను ఈనెలాఖరుకు పూర్తిచేయన్నారు.


నాడు-నేడు... అలమండ-పాండ్రంగి రోడ్డు

గత వైసీపీ హయాంలో పూర్తిస్థాయి గోతులతో నిండిపోయి అధ్వాన స్థితికి చేరిన రోడ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు.. ప్రస్తుతం మారిన రూపరేఖలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలు కిందట చూసిన రోడ్లకు, ప్రస్తుత రహదారులకు పొంతన లేదని, గుంతలు లేని రోడ్లపై ప్రయాణం ప్రమాదాలను దూరం చేసిందని పేర్కొంటున్నారు.

40 కిలో మీటర్ల గుంతలు పూడిక..

జిల్లాలో రోడ్లు, భవనాలశాఖ పరిధిలో 253 కిలో మీటర్ల రహదారులున్నాయి. ఇందులో 70 కిలోమీటర్లు మేర రోడ్లపై గుంతలు ఉన్నట్టు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. వీటిలో రాష్ట్ర రహదారులు 20 కిలోమీటర్లు కాగా, జిల్లా రహదారులు 50 కిలోమీటర్లు. ఈ రోడ్లపై గుంతలను సంక్రాంతి నాటికి పూడ్చి వేసేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో, దానికి అనుగుణంగా రూ.1.38 కోట్లను మంజూరు చేసింది. దీంతో అధికారులు ప్రక్రియ వేగవంత చేశారు. టెండర్లు పూర్తి చేసి నెలన్నర కిందట పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు 40 కిలోమీటర్లు మేర రోడ్లపై గుంతలను పూర్తిగా పూడ్చేశారు. మరో పది కిలోమీటర్లు మేర గుంతలను దాదాపు 70 శాతం మేర పూడ్చినట్టు చెబుతున్నారు. మరో 20 కిలోమీటర్లు పనులు ప్రారంభదశలో ఉన్నాయన్నారు. ఇటీవల తుఫాన్ కారణంగా కొన్నిచోట్ల పనుల్లో జాప్యం నెలకొందని, లేదంటే ఇప్పటికే అన్ని పనులు పూర్తయ్యేవని అధికారులు చెబుతున్నారు.

పూర్తయిన రోడ్లు ఇవే..

ఇప్పటివరకు ఆనందపురం మండలంలోని ... మిగతా 4వ పేజీలో

ఫలించిన ఎంపీ కృషి

- విశాఖ నుంచి అంతర్జాతీయ ఎయిర్ కార్గో సేవలు
- పునరుద్ధరణకు అనుమతుల మంజూరు
- పారిశ్రామిక వర్గాల్లో హర్షాతిరేకాలు



విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):
విశాఖ విమానాశ్రయంలో ఎయిర్‌కార్గో కార్యకలాపాలను పునరుద్ధరించనున్నారు. ఈ సేవలు నిలిచిపోవడంతో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎంపీ శ్రీభరత్ పునరుద్ధరణకు కృషిచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు.
విమానాశ్రయంలో వచ్చే వారం నుంచే అంతర్జాతీయ ఎయిర్‌కార్గో సేవలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సుముద్రం ద్వారా ఎగుమతి, దిగుమతులు జరుగుతున్నాయి. ఫార్మా ఉత్పత్తులు, దుస్తులు, రొయ్యల రవాణాకు ఇబ్బందులు ఎదురయ్యాయి. 2019-20 మధ్య 470 టన్నుల అంతర్జాతీయ ... మిగతా 4వ పేజీలో

బాధిత కుటుంబాలకు బాసట


తాటిచెట్లపాలేనికి చెందిన లావణ్య కుమార్తెను ఓదారుస్తున్న మంత్రి అనిత


తిరుపతి తొక్కిసలాట మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. నగరంలో మూడు బాధిత కుటుంబాలకు ఆదివారం రూ.25 లక్షల చొప్పున చెక్కులను అందించారు. కంచరపాలెంలోని శాంతి కుటుంబ సభ్యులకు మంత్రి వంగలపూడి అనిత, టీటీడీ బోర్డు సభ్యులు చెక్కును ఇచ్చారు. చిత్రంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులు ఉన్నారు. - వివరాలు 4లో

ముగిసిన రెవెన్యూ సదస్సులు

- మొత్తం వినతులు 7,065
- పట్టాదారు పాసు పుస్తకాలకు 1,983
- పెందుర్తి నుంచి 1,355, ములగాడలో 135
- పరిష్కరించినవి 3,392, పెండింగ్ 3,673

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు భారీ సంఖ్యలో వినతులు వచ్చాయి. ఎక్కువగా పట్టాదారుపాసు పుస్తకాల కోసం రావడం క్షేత్రస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం పనితీరును తేటతెల్లం చేస్తోంది. గతనెల ఆరోతేదీన ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు ఈనెల తొమ్మిదోతేదీతో ముగిశాయి. జిల్లాలోని 11 మండలాల పరిధి 162 గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో మొత్తం 7,065 వినతులు రాగా వాటిలో ఇంతవరకు 3,392 (51.99శాతం) పరిష్కరించగా 3,673 పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా పెందుర్తి మండలం నుంచి 1,355 వినతులు అందగా తక్కువగా ములగాడ నుంచి కేవలం 135 వచ్చాయి. మొత్తం 26 అంశాలకు సంబంధించి రైతులు, ప్రజల నుంచి వచ్చిన వినతులు అందాయి. పట్టాదారు పాసుపుస్తకాలు అందించడంలో వీఆర్వోలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలకు బలంచేకూరేలా 1,983 వినతులు వచ్చాయి. వాటిలో 605 మంది రైతులకు పాసుపుస్తకాలు అందజేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రక్షణకు సంబంధించి 1378, ఇళ్ల స్థల పట్టాలకు 719, 22-ఎ నుంచి తమ భూములను తొలగించాలని 687, కుల ధ్రువీకరణపత్రాలకు 512, రీసర్వే కోసం 362, రీసర్వే (ఎస్ఎస్ఎల్ఆర్)కు 332, భూమి సరిహద్దుల గుర్తింపునకు 315,భూ కబ్జాలపై 182 వినతులు వచ్చాయి. మిగిలినవి ఇతర అంశాలకు సంబంధించినవి.

నగరంలో కాలుష్యం

- పది రోజులుగా పెరుగుతున్న ధూళి కణాలు
- సగటు కంటే రెండు నుంచి నాలుగు రెట్లు ఎక్కువ
- పీఎం 10, పీఎం 2.5 అధికంగా నమోదు
- పూర్ కేటగిరీలో విశాఖపట్నం



విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):
నగరంలో మళ్లీ కాలుష్యం పెరుగుతోంది. ఈనెల ఒకటో తేదీ నుంచి ఆదివారం వరకు గాలిలో ధూళి కణాల శాతం సగటు కంటే రెండు నుంచి నాలుగు రెట్లు ఎక్కువగా నమోదవడం ప్రమాద తీవ్రతను తెలుపుతోంది. ముఖ్యంగా ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే పీఎం 10, పీఎం 2.5 ఎక్కువగా నమోదవడంపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
జీవీఎంసీ ప్రధాన కార్యాలయం భవనంపై ఉన్న ఆన్‌లైన్ యాంబియంట్ ఎయిర్‌క్వాలిటీ మిషన్‌లో ఆదివారం సగటున పీఎం 2.5 అయితే 203 (ఏడాది సగటు 40) నమోదైంది. గరిష్ఠంగా 287, కనిష్ఠంగా 102 నమోదైంది. 24 గంటలపాటు నమోదైన వివరాల సగటు మేరకు పీఎం 2.5 అయితే 203గా రికార్డు కావడంతో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశించిన ప్రామాణికాల మేరకు పూర్ కేటగిరీగా నమోదైంది. యాంబియంట్ ఎయిర్‌క్వాలిటీ 50 కంటే తక్కువగా ఉంటే గుడ్, 51 నుంచి 100 వరకు సంతృప్తికరమని, 101 నుంచి 200 వరకు మోడరేట్, 201 నుంచి 300 వరకు పూర్, 301 నుంచి 400 వరకు నమోదైతే వెరీ పూర్ అని పరిగణిస్తారు. ఈనెలలో మూడు, నాలుగు, తొమ్మిది తేదీలలో పీఎం 2.5 యాంబియంట్ ఎయిర్‌క్వాలిటీ పూర్ కేటగిరీలో ఉంది.
నగరంలో డిసెంబరు, జనవరిలో కాలుష్యం ప్రభావం ఎక్కువ. గాలుల వేగం తక్కువ, నగరం బౌల్ ఏరియాలో ఉండడం, పోర్టుతోపాటు, పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం బయటకు వెళ్లకపోవడంతో మంచు కురవడంతో ధూళి కాలుష్యం నగరంపై సెటిల్ అవుతుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. గాలిలో ... మిగతా 4వ పేజీలో





అబ్బురపరిచిన విన్యాసాలు

ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహార విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. - వివరాలు 4లో

విశాఖలో గ్రావెల్ దొంగలు!

రాజకీయ నేతల పేరుతో అక్రమాలు

- యథేచ్ఛగా గ్రావెల్, మట్టి తవ్వకాలు
- ఆనందపురం మండలంలో జేబులు నింపుకుంటున్న మట్టి మాఫియా
- గుర్రంపాలెం ఏపీఐఐసీ లేఅవుట్‌లో ప్లాట్ల ఫిల్లింగ్ పేరుతో విక్రయాలు

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కొండలపై గ్రావెల్ దొంగలు పడ్డారు. ఎక్స్‌వేటర్లతో యధేచ్ఛగా గ్రావెల్ తవ్వకుని విక్రయిస్తున్నారు. రాత్రికి రాత్రే యంత్రాలతో కొండలు డొలిచేస్తున్నారు. రాత్రిపూట, తెల్లవారుజామున ఈ దందా దర్జాగా సాగుతోంది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండతో రెచ్చిపోయిన గ్రావెల్ మాఫియా కూటమి అధికారంలోకి వచ్చినా అక్రమాలు కొనసాగిస్తోంది.
గత ఏడాది డిసెంబరు వరకు వర్షాలు కురవడం కొండల తవ్వకాలకు అనువుగా మారింది. ఆనందపురం మండలం తర్లువాడ, నగరపాలెం, శొంఠ్యాం, గిడిజాల, చందక, రామవరం, గండిగుండం, కుశలవాడ, దబ్బంద తదితర గ్రామాలు, పెందుర్తి పరిధిలోని నరవ, గుర్రంపాలెం తదితర గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలు పెచ్చుమీరుతున్నాయి. తర్లువాడ పంచాయతీ నగరపాలెం సర్వేనంబరు 165లో ఉన్న కొండను అదే గ్రామానికి ఓ వ్యక్తి రాత్రిపూట తవ్వి తరలిస్తున్నారు. ఉదయం కొండ వద్దకు ... మిగతా 4వ పేజీలో


నగరపాలెం సర్వేనంబరు 165లో అక్రమార్కులు తవ్వేసిన కొండ

బాలిక మృతి పట్ల విచారణ

పద్మనాభం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కళాశాల బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడి బాలిక మృతి చెందిన ఘటనపై అధికారులు సమగ్ర నివేదిక తయారు చేసి ఇవ్వాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఆదేశించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ముందు నుంచీ సెలవుల విషయమై ఇంటర్ అధికారులను, కళాశాలల యాజమాన్యాలను అప్రమత్తం చేస్తున్నా, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులని సెలవు రోజుల్లో కూడా కళాశాలలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఈవిషయమై కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు కూడా అధికారులకు తరచూ హెచ్చరికలు జారీ చేసినా ఫలితం ఉండడం లేదని చెప్పారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని, విద్యార్థి మృతికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు తక్షణమే నివేదిక తయారు చేసి పంపించాలని ఆదేశించామన్నారు. నివేదిక ఆధారంగా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోదండపాణిగా అప్పన్న



సింహాచలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి కోదండపాణిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ధనుస్సు (కోదండం), శరం ధరించిన రీతిలో అలంకారి సీతారామాచార్యులు స్వర్ణాభరణాలతో అలంకరించారు. పండితులు వేదమంత్రోచ్ఛారణలు, విద్వాంసుల నాదస్వరాలపనలు నడుమ మాడవీధుల్లో మహిళల కోలాటాలు ముందు సాగగా స్వామివారి తిరువీధి ఉత్సవం కనుల పండువగా జరిగింది. మార్గం పొడవునా భక్తుల హరినామస్మరణలు మార్మోగాయి.

సంప్రదాయబద్ధంగా ధారోత్సవాలు

సింహాచలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ధారోత్సవాలు సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్నాయి. ఆదివారం వేకువజామున ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తులను గోదాదేవి, సువర్ణ తాయార్, చతుర్భుజి అమ్మవార్లను పల్లకిలో ఉంచారు. మంగళవాయిద్యాల నడుమ అమ్మవార్లను మాడవీధుల్లో తిరువీధిగా ఈశాన్య దిక్కులోని గంగధారకు తోడ్కొని వెళ్లారు. పండితులు చతుర్వేదాల పారాయణలు చేయగా, అధ్యాపకులు దివ్య ప్రబంధాన్ని అనుసంధానం చేస్తుండగా షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పంచామృతాలతో, గంగధార జలాలతో అభిషేకాలు జరిపారు.మండపంలో అమ్మవార్లను అధిష్ఠింపజేసి 28వ పాశురాన్ని విన్నవించారు.

గోదాదేవికి పూజలు

సింహాచలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి కొండ దిగువ పూదోటలో కొలువుదీరిన అలిమేల్మంగా, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు జరిపి ఉత్సవమూర్తిని గోదాదేవిగా శోభాయమానంగా తీర్చిదిద్ది ప్రత్యేక వేదికపై ఉంచారు.షోడశోపచరాలు సమర్పించిన తరువాత గోదాదేవి రచించిన తిరుప్పావైలోని 28వ పాశురాన్ని వైదికులు భక్తులతో కలిసి విన్నవించారు. తరువాత ప్రత్యేక నివేదనలు జరిపి భక్తులకు తీర్థగోష్ఠి నిర్వహించారు.

యల్లా ప్రగడకు నివాళి

సాగర్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఔషధ రంగంలో అనేక పరిశోధనలు చేసి ప్రజల ప్రాణాలను కాపాడే మందులు కనుగొన్న డా.యల్లాప్రగడ సుబ్బారావు సేవలు చిరస్మరణీయుడని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాస్ అన్నారు. ఆదివారం గీతం వర్సిటీలో డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతి ఘనంగా నిర్వహించారు.

ఐదుగురిపై కేసు నమోదు

పద్మనాభం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న అయిదుగురిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. అనంతవరంలో సారిక పైడిరాజు ఇంటి వెనుక పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సీఐ సీహెచ్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్సై సురేశ్ సిబ్బందితో దాడి చేశారు. ఈమేరకు అయిదుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద పేక ముక్కలు, రూ. 3700 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మేడ పైనుంచి జారి పడి మహిళ మృతి

ఎండాడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళ మేడ పైనుంచి జారి పడి మృతి చెందింది. పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. కొంజేటి సుధ (57) భర్తతో కలిసి విజయవాడలో ఉంటోంది. ఈ నెల 10న మధురవాడ ఐటీ సెజ్‌లోని హరితా అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న పెద్ద కుమారుడు వెంకట సందీప్ ఇంటికి వచ్చింది. ఆయన వైద్యుడిగా పని చేస్తున్నారు. సుధ కొన్నేళ్లుగా రక్తపోటు, డయాబిటీస్, థైరాయిడ్, మోకాలి నొప్పులు వంటి రోగాలతో బాధపడుతుంది. ఈమేరకు ఆదివారం మేడ పైనుంచి జారి పడి మృతి చెందింది. మృతురాలి భర్త వేణుగోపాల్ కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ





ప్రదర్శనల్లో భాగంగా బాలికల విన్యాసాలు

విలువలతో కూడిన విద్య అవసరం

- దేశ భక్తులను అందించే మిషన్ విజ్ఞాన్ విహార్
- కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

ఆనందపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : దేశ భక్తులను అందించే మిషన్ విజ్ఞాన విహార్ పాఠశాల అని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు.ఆదివారం రాత్రి గుడిలోవలో జరిగిన విజ్ఞాన్ విహార పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అనేక విద్యా సంస్థలు కేవలం మార్కుల కోసం విద్యార్థులను తయారు చేస్తుండగా ఇక్కడ మాత్రం ధైర్య సాహసాలు, విలువలతో కూడిన విద్య నేర్పుతున్నారని కొనియాడారు. సమాజానికి బాధ్యత గల పౌరులను అందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావు మాట్లాడుతూ విజ్ఞాన విహార వంటి గొప్ప సంస్థలో పిల్లలను చదివించడం ఎంతో అదృష్టమని చెప్పారు. ఉత్తమ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ పాఠశాలను మిగతా వాళ్లు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యా భారతి అధ్యక్షుడు పి.వి. నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ కృష్ణకుమార్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

వేడుకల్లో భాగంగా విద్యార్థులు మోటారు బైక్ ఫీట్స్‌తో అలరించారు. పాఠశాల క్రీడా మైదానంలో మూడు నుంచి నాలుగు గంటల వరకు 66 క్రీడా విన్యాసాలు చేపట్టారు. వీటిని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రారంభించగా ఎంపీ బాబూరావు క్రీడా పతకం ఆవిష్కరించారు. మంకంబ్‌పై బాలురతో పాటు బాలికలు సమానంగా చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బాలికలు బైక్ నడపడంతో పాటు విన్యాసాలు చేశారు. బాలురు బైక్‌తో 30 అడుగుల గాలిలో చేసిన విన్యాసాలు, నిప్పు చక్రంలో నుంచి దూకడం ఔరా అనిపించాయి.



దర్శనానికి వెళుతున్న చందన స్వాములు

అప్పన్న దీక్షలు విరమణ

సింహాచలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దీక్షలు చేపట్టిన భక్తులు ఆదివారం మాల విసర్జన చేశారు. గత నెల 2న మండల, 12న ద్వాత్రింశతి (32 రోజులు) దీక్షలను అప్పన్న ఆలయ అర్చకుల చేతుల మీదుగా వేలాది మంది భక్తులు స్వీకరించారు. ఆదివారం వేకువజామున సింహగిరికి చేరుకున్న చందనస్వాములు స్వామివారిని దర్శించుకుని, తిరుముడులు సమర్పించారు. దీక్షల విరమణ పురస్కరించుకుని దేవస్థానం అధికారులు ఉచిత రవాణా, దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఒకరోజు వసతి, భోజన సదుపాయం కల్పించారు. అలాగే 98వ వార్డు పరిధిలోని చందన పెరుమాల్ పీఠం వ్యవస్థాపకుడు సానబోయిన పైడిరాజు, సింహాద్రి మఠం వ్యవస్థాపకుడు కసిరెడ్డి సురేంద్ర తమ పీఠాలలో తిరుముడులు కట్టి, పూజలు, సంకీర్తనలకు మార్గదర్శకం చేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

భీమునిపట్నం (రూరల్), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో పది రోజుల పాటు జరిగే ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ ఆదివారం నుంచి ప్రారంభమైంది. విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 356 మంది జూనియర్, సీనియర్ క్యాడెట్లు శిక్షణకు హాజరయ్యారు. కల్నల్ గోపేంద్ర ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు.

హెచ్‌ఎస్‌ఎల్ పూర్వ విద్యార్థుల కలయిక



విశాలాక్షినగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : హిందూస్థాన్ షిప్ యార్డు పాఠశాలకు చెందిన 1989-90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం వుడా పార్కులో సందడి చేశారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకుని, చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. ఆడుతూ, పాడుతూ, డ్యాన్సులు చేస్తూ ఆనందంగా గడిపారు. అనంతరం తెన్నేటీ పార్కు. ఆర్కే బీచ్‌ను సందర్శించారు.పూర్వ విద్యార్థులు వానపల్లి కిశోర్, నారాయణ, అలిషా, జగదీష్, మాణిక్యం, బేబి, విజయ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

'యూనివర్సిటీల్లో జీతాలు ఆపలేదు'

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో బోధన, బోధనేతర సిబ్బందికి యథావిధిగా జీతాలు అందుతున్నాయని, కొన్ని యూనివర్సిటీల్లో సాంకేతిక కారణాలతో ప్రక్రియ నిలిచిపోవడం మినహా ఎక్కడా జీతాలను ఆపలేదని ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి కార్యదర్శి టీవీఎస్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీల్లో జీతాలు ఆగిపోయాయనే ప్రచారంపై ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం, బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆంధ్రా యూనివర్సిటీలు సాంకేతిక కారణాలతో జీతాల బిల్లులు సకాలంలో అప్‌లోడ్ చేయలేదని, అందువల్ల అక్కడ జీతాలు ఆగాయన్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ నాలుగు వర్సిటీల్లోని సిబ్బందికి జీతాలు జమవుతాయని తెలిపారు.

ఫలించిన ఎంపీ శ్రీభరత్ కృషి

...3వ పేజీ తరువాయి

కార్గో రవాణా జరిగిన విమానాశ్రయంలో ఈ సేవలు నిలిచిపోయాయి.

కేంద్రంతో నిరంతర చర్చలు

ఎయిర్‌కార్గో సేవలు నిలిచిపోవడంతో పారిశ్రామికవేత్తలు సమస్యను ఎంపీ శ్రీభరత్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివరించారు. ఎయిర్‌పోర్టు అధికారులు, అడ్వైజరీ కమిటీ సిఫార్సులను నివేదించారు. విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పరిష్కారం దిశగా పలుమార్లు సమావేశమయ్యారు. దీంతో ఎయిర్‌కార్గో సేవల పునరుద్ధరణకు అనుమతి లభించింది. ఈ క్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ కార్గో నిర్వహణ బాధ్యతలు స్వీకరించేందుకు ముందుకు వచ్చింది. ఎయిర్‌కార్గో సేవల ప్రారంభానికి అనుమతి లభించడం పట్ల ఎంపీ శ్రీభరత్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సేవలు పారిశ్రామిక రంగానికి ఊతమిస్తాయన్నారు. ఇక్కడి ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం ఉంటుందన్నారు. సేవల పునరుద్ధరణకు సహకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సేవల పునరుద్ధరణపై ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.కుమార్ రాజా, ఒ.నరేష్‌కుమార్, డీఎస్ వర్మ హర్షం వ్యక్తం చేశారు.



కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జోయల్ ఓరమ్‌తో అమేయ, తదితరులు

అమేయకు నేషనల్ యూత్ ఐకాన్ అవార్డు

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా న్యూఢిల్లీలో ఆదివారం నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవంలో నగరానికి చెందిన ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారిణి లగుడు అమేయ నేషనల్ యూత్ ఐకాన్ 2025 అవార్డు అందుకున్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జోయల్ ఓరమ్ చేతుల మీదుగా ఈ అవార్డు తీసుకున్నారు. అమేయ శాస్త్రీయ నృత్య కళాకారిణిగా వందకు పైగా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రదర్శలిచ్చారు. ఇప్పటివరకు 8 అంతర్జాతీయ, 9 జాతీయ, 18 రాష్ట్రస్థాయి అవార్డులు పొం దారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, పది ప్రపంచ రికార్డులు సాధించారు.

జోరుగా గాలిపటాల అమ్మకం



బీచ్ రోడ్డులో గాలిపటాల అమ్మకాలు

ఎండాడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి అంటేనే గాలిపటాల పండుగ. రంగు రంగుల గాలిపటాలతో చిన్నారులు నింగికి నిచ్చెన వేసినట్టుగా పతాంగులను ఎగరేస్తూ ఆనందం పొందుతారు. ఏటా మాదిరిగానే ఈసారి కూడా నగరంలోని పలు మార్కెట్‌లతో పాటు రోడ్లపైన రంగు రంగుల పతాంగులు సందడి చేస్తున్నాయి. ముఖ్యంగా బీచ్ రోడ్డు, తెన్నేటి పార్కుకు వెళ్లే మార్గాల్లో వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. రూ. 30 నుంచి రూ. 500 వరకు ధరలు ఉన్నాయి.

సంప్రదాయబద్ధంగా శాంతి కల్యాణం

సింహాచలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం సంప్రదాయబద్ధంగా శాంతి కల్యాణం నిర్వహించారు. నృసింహ దీక్షలు ముగింపు పురస్కరించుకుని వేకువజామున సుప్రభాత ప్రభాత సేవలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించిన ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ చేసి మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ కల్యాణ క్రతువు జరిపారు. అలాగే స్వామివారి సన్నిధానంలో శాంతి హవనం కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, వెంకటరమణాచార్యులు, ఈఓ వేంద్ర త్రినాథరావు, ఏఈఓ నక్కాన ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా నాట్య మండలి సంక్రాంతి సంబరాలు

తగరపువలస, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలోని ప్రజా నాట్య మండలి కళాకారులు ఆదివారం చిట్టివలస బంతాట మైదానంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భీమిలి, భోగాపురం మండలాలకు చెందిన మహిళా కోలాటం బృంద సభ్యులు పలు నృత్యాలు చేశారు. ముందుగా తాతా థియేటర్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మూర్తి అప్పలనాయుడు, నరసింగరావు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు గుర్రపు రమణ, కార్యదర్శి చంటి, జోన్ అధ్యక్షుడు పల్లా పోతురాజు పాల్గొన్నారు.

యువత వివేకానంద అడుగుజాడల్లో నడవాలి

జయంతి కార్యక్రమాల్లో వక్తలు

పద్మనాభం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద యువతకు ఆదర్శనీయమని సామాజిక కార్యకర్త రూపాకుల రవికుమార్ చెప్పారు. పద్మనాభంలోని గోస్తనీ విద్యా పీఠ్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం వివేకానందుని జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాపీఠ్ వ్యవస్థాపకుడు కె. సూరిబాబు, రిటైర్డు ఉపాధ్యాయుడు బి.సన్యాసినాయుడు, శ్రీనివాసరావు, కృష్ణారావు పాల్గొన్నారు. కృష్ణాపురంలో బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు హంస మహేశ్ ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి నిర్వహించారు.పలువురు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్. ప్రకాశ్, మండల కార్యదర్శి బి. పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు. పాండ్రంగిలో వివేకానంద జయంతి సందర్భంగా టీడీపీ నాయకుడు, వార్డు సభ్యుడు మహంతి అప్పలరమణ నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.



పద్మనాభం : వేడుకల్లో రవికుమార్, తదితరులు

భీమునిపట్నం : భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహానుభావుడు వివేకానంద అని ఆదర్శ హిందీ ప్రేమి మండలి గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు అన్నారు. జీఎస్ఆర్ భవన్, మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న వివేకానంద విగ్రహానికి నూకరాజు పూలమాల వేసి నివాళి అర్పించారు.ఆదర్శ హిందీ ప్రేమిమండలి అధ్యక్షుడు కేఎస్ఆర్ కృష్ణారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. 4వ వార్డు నేరేళ్లవలసలో బీజేపీ మత్స్యకార సెల్ కన్వీనరు వాసుపల్లి శ్రీహరి ఆధ్వర్యంలో వివేకానంద జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం విశ్రాంత ఉపాధ్యాయులు డీవీఆర్ గుప్తా, గ్రామ నాయకులు గరికిన రామారావు, వాసుపల్లి హరితల్లి, ఊళ్ళ సంధ్య, పరదేశమ్మ, మైలపల్లి బుజ్జి పాల్గొన్నారు. సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పంచదార్ల సింహాద్రి ఆధ్వర్యంలో సాయిసదనంలో వివేకానంద జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఆనందరావు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద విగ్రహానికి పూలమాలవేస్తున్న నూకరాజు



మద్దిలపాలెంలో రజనీ తల్లిదండ్రులకు చెక్కు ఇస్తున్న బోర్డు సభ్యులు

ప్రాణాలు తేలేం..ప్రాణప్రదంగా చూసుకుంటాం

తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందినవారి కుటుంబాలకు హోంమంత్రి అనిత భరోసా

అక్కయ్యపాలెం/కంచరపాలెం/మద్దిలపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందిన సూరిశెట్టి లావణ్య స్వాతి, కండిపిల్లి శాంతి, గుడ్ల రజిని ప్రాణాలు తీసుకురాలేం...కానీ.. వారి పిల్లల బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మృతుల కుటుంబాల్లో ఒక్కొక్కరికి టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగం, వారి పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు వివరాలు సేకరించామని తెలిపారు. ఆదివారం ఆమె ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి తదితరులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు వారి ఇళ్లకు వెళ్లి రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారం చెక్కులు అందించారు. ముందుగా తాటిచెట్లపాలెం వెంకటేశ్వర కాలనీలో ఉంటున్న లావణ్య భర్త సతీశ్, పిల్లలు శ్రీలాస్య, కీర్తిశ్రీల బాగోగులు తెలుసుకున్నారు. శ్రీలాస్య, కీర్తిశ్రీలకు చెరో రూ.10 లక్షల బ్యాంకులో ఫిక్స్‌డ్‌డిపాజిట్ చేసినట్టు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెలిపారు. రూ. 5 లక్షలు లావణ్య భర్త సతీష్‌కు ఇచ్చామన్నారు. అలాగే కంచరపాలెం ప్రాంతానికి చెందిన మృతురాలు కండిపిల్లి శాంతి భర్తకు రూ.7 లక్షలు, కుమారుడికి రూ.18 లక్షలు ఇచ్చినట్లు వెల్లడించారు.

బస్సులు కిటకిట

...3వ పేజీ తరువాయి

సర్వీసులు నడిపారు. ప్రయాణికుల డిమాండ్ ఉంటే రాత్రి సమయంలోనూ కూడా బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు. సోమవారం కూడా ఇదే రద్దీ కొనసాగే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

రైలు ప్రయాణికులకు ప్రత్యేక సదుపాయాలు

విశాఖపట్నం : సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు రైల్వే అధికారులు అదనపు సదుపాయాలు కల్పించారు. జనరల్ టికెట్ బుకింగ్‌కు అదనపు కౌంటర్లు, ఆటోమెటిక్ వెండింగ్ మిషన్లను ఉంచారు. అదనపు సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసి రైళ్ల రాకపోకలపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. తాగునీరు, క్యాటరింగ్ సేవలు విస్తృతం చేశారు. ఆర్పీఎఫ్ దళాలు 24 గంటలు గస్తీ నిర్వహిస్తున్నాయన్నారు. వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామన్నారు.

గుంతల రోడ్లకు సెలవిక!

... 3వ పేజీ తరువాయి

నీల కుండీలు జంక్షన్ నుంచి సింహాచలం వరకు ఆరు కిలో మీటర్లు, భీమిలి నుంచి దొరతోట జంక్షన్ వరకు ఎనిమిది కిలో మీటర్ల రోడ్డు, పద్మనాభం నుంచి నీల కుండీలు జంక్షన్ వరకు ఆరు కిలోమీటర్లు రోడ్లపై గుంతలు పూడ్చివేశారు. ఇక రాష్ట్ర రహదారుల విషయానికి వస్తే అల మండ రైల్వేస్టేషన్ నుంచి పాండ్రంగి మార్గంలో ఆరు కిలోమీటర్లు, తగరపువలస మహరాజుపేట జంక్షన్ నుంచి పద్మనాభం వరకు 11 కిలోమీటర్లు, సింహాచలం డొబ్బ రోడ్డు నాలుగు కిలోమీటర్లు, అడవివరం నుంచి బొడ్డునాయుడుపాలెం పది కిలోమీటర్లు, పద్మనాభం మండలంలోని చిన్నాపురం జంక్షన్ నుంచి నేరెళ్లవలస ఐదు కిలో మీటర్లు, భీమిలి మండలం తగరపువలస నుంచి తాటితూరు ఐదు కిలోమీటర్లు, బోని జంక్షన్ నుంచి పాండ్రంగి వరకు ఐదు కిలోమీటర్లు, గుడివాడ నుంచి అన్నవరం వరకు ఐదు కిలోమీటర్లు గుంతుల పూడ్చివేత పనులు సాగుతున్నాయి. వీటిలో రెండు చోట్ల 70 శాతం పూర్తయినట్టు అధికారులు తెలిపారు.

నగరంలో కాలుష్యం

... 3వ పేజీ తరువాయి

ధూళి కణాల ప్రభావం పెరగడంతో పీఎం 2.5, పీఎం 10 పరిమితికి మించి నమోదవుతుందన్నారు. ఇది ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. పీఎం 2.5 అంటే కంటికి కనిపించని అత్యంత సూక్ష్మ ధూళి కణాలు. గాలి పీల్చుకున్నప్పుడు శరీరంలోనికి వెళ్లి ఊపిరితిత్తుల్లో సెటిల్ అవుతుంది.పీఎం 10 ధూళి కణాల పరిమాణం కొంచెం ఎక్కువ కనుక గాలి పీల్చినపుడు ముక్కుద్వారా వెళ్తే తుమ్ముల ద్వారా బయటకు వచ్చేస్తాయి. పోర్టు, పరిసరాల్లో పరిశ్రమల నుంచి వచ్చే ధూళి, భవన నిర్మాణాలు, వాహన కాలుష్యం ప్రమాదకరంగా ఉంది. నగరంలో 12 లక్షలకుపైగా ఉన్న వాహనాలలో కొంతవరకు కాలం చెల్లినవి. వీటినుంచి నల్లని పొగ రావడం కాలుష్యానికి కారణంగా పేర్కొంటున్నారు. భవన నిర్మాణ సమయంలో ధూళి కణాలు రాకుండా ప్రమాణాలు పాటించడం లేదు. చుట్టూ టార్పాలిన్ల ఏర్పాటు, నీటిని పిచిరారీ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. రాత్రి కురిసే మంచు పగటి పూట ఎండకు పొడిగా మారి గాలుల ద్వారా నగరంలో అన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

విశాఖలో గ్రావెల్ దొంగలు!

... 3వ పేజీ తరువాయి

వెళితే.. ఆనవాళ్లు మినహా ఎవరూ కనిపించరు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రెచ్చిపోయిన ఈ వ్యక్తి ఇప్పుడూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. ఇతడికి కూటమి పార్టీలకు చెందిన చోటా నాయకులు, రెవెన్యూ, పోలీసుల అండ ఉందనే ఆరోపణలున్నాయి. శొంఠ్యాంలో స్థానిక ప్రజాప్రతినిధికి గనుల శాఖ భారీ జరిమానా విధించినా అతడి అనుచరులు అక్రమాలను ఆపలేదు. గిడిజాల కొండ నుంచి వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వి విక్రయించిన మరికొందరు స్థానిక నాయకులు రూ.కోట్లు సంపాదించారు. జాతీయ రహదారికి ఆనుకుని వాణిజ్య సముదాయాలు, లేఅవుట్‌లు, ఇళ్ల నిర్మాణాలకు భారీగా గ్రావెల్, మట్టి అవసరం కావడంతో అక్రమార్కుల పంట పండుతోంది.

గుర్రంపాలెంలోనూ అంతే...

పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌లో వ్యాపారులకు కేటాయించిన ప్లాట్ల ఫిల్లింగ్‌కు తొలుత ఏపీఐఐసీకి చెందిన కొండను తవ్వేశారు. ఆ తరువాత పక్కనే ఉన్న రెవెన్యూకు చెందిన కొండను తవ్వుతున్నారు. అక్రమంగా గ్రావెల్ తవ్విన ఏడు పారిశ్రామిక సంస్థలకు గనుల శాఖ విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీచేశారు. అయినా మరికొందరు పారిశ్రామికవేత్తలు గ్రావెల్ తవ్వుతూనే ఉన్నారు. ఈ తవ్వకాలకు ఒకరిద్దరికి మాత్రమే పర్మిట్లున్నాయి. ఏపీఐఐసీకి చెందిన కొండను పరిరక్షించాల్సిన సంస్థ అధికారులు, సిబ్బంది ప్లాట్ల యజమానులతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలున్నాయి. విచిత్రమేమిటంటే కొండలు తవ్వేసిన తరువాత హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఏపీఐఐసీ కేటాయించిన ప్లాట్ల ఫిల్లింగ్, సమీపంలో గుట్ట, రెవెన్యూకు చెందిన కొండలో అక్రమతవ్వకాలపై వాస్తవాలు వెలుగులోకి రావాలంటే గూగుల్ మ్యాపులు పరిశీలించాలనే వాదన వినిపిస్తోంది. దీంతో పాటు గ్రావెల్ తవ్వకాల వ్యవహారంలో ఏపీఐఐసీ అధికారుల నిర్వాకంపై విచారణ చేపట్టాలని గండిగుండం, గుర్రంపాలెం గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

మంగమారిపేట తీరంలో కొట్టుకుపోయిన బోటు

భీమునిపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మంగమారిపేట తీరంలో లంగరు వేసిన ఇంజన్ బోటు సముద్రంలోకి కొట్టుకుపోయింది. గ్రామానికి చెందిన సూరాడ హరిబాబుకు చెందిన బోటుపై మత్స్యకారులు వేటకు వెళ్లి శనివారం రాత్రి తిరిగి వచ్చారు. తీరంలో లంగరు వేసి ఇళ్లకు చేరారు. ఆదివారం తీరంలో బోటు లేకపోవడంతో హరిబాబు ఆందోళన చెందారు. సముద్రంలోకి మరో బోటుపై వెళ్లి గాలించారు. కొంతదూరంలో బోటు బోల్తా పడి కొట్టుకుపోతుండడాన్ని గమనించి, మరో రెండు బోట్లు వేసుకువెళ్లి ఆ బోటును ఒడ్డుకు తీసుకువచ్చారు. సుమారు రూ. 20 నష్టం జరిగినట్టు బాధితుడు తెలిపారు.



చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటున్న మంత్రి అనిత

మానవత్వం చాటుకున్న హోం శాఖా మంత్రి అనిత

గాజువాక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం ఉదయం పాత గాజువాక జంక్షన్‌లో ఓ ద్విచక్ర వాహనదారుడుని ట్రావెల్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న చిన్నారి గాయపడింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత కాన్వాయ్‌ను ఆపి ఘటనా స్థలికి వెళ్లారు. చిన్నారికి తగిన వైద్య సేవలందించాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించారు.

ఘనంగా శక్తి క్షేత్రం వార్షికోత్సవం

పెందుర్తి-రూరల్, జనవరి (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 95వ వార్డు పరిధి సుజాతనగర్ సమీపంలోని పాపయ్యరాజుపాలెంలోని బ్రహ్మర్షి పిరమిడ్ శక్తి క్షేత్రం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ పిరమిడ్ మాస్టార్లు మాట్లాడుతూ శక్తి క్షేత్రం ఏర్పాటు వెనక బ్రహ్మర్షి పత్రీజీ, అప్పాజీల తోడ్పాటు, కృషిని కొనియాడారు. సంగీత కచేరీ, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పిరమిడ్ మాస్టార్లను ధ్యాన బోధకులు, సేవకులు సత్కరించారు. శక్తి క్షేత్రం పరిపాలకులు పి.చంద్రశేఖర్, సతీశ్, వాణి, జ్యోతి, ఆత్మానందం, సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

16న ముగ్గుల పోటీలు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకుని తుంగ్లాం కాలనీలో ఈ నెల 16న కాకి కుంచారావు జ్ఞాపకార్థం నిర్వహించనున్న ముగ్గుల పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కనుమ రోజున జరిగే ముగ్గుల పోటీల విజేతలకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.ఐదు వేలను బహుమతులుగా అందజేస్తామన్నారు. అలాగే పోటీలో పాల్గొనేవారందరికీ ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు నావన సింహాచలం, వి.వరహాలు, కె.కుంచారావు, పి.అర్జున్, పాపారావు, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక హక్కులను కాపాడతాం'

మల్కాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికుల హక్కులను కాపాడడమే తమ ధ్యేయమని తెలుగు యువత 'పశ్చిమ' ఉపాధ్యక్షుడు గుత్తుల మధుబాబు అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వివేకానందున్ని యువతీ యువకులందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస).
● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 14, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 56, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 46, బీరకాయలు 58, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 40, దొండకాయలు 50, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 46, మునక్కాడలు (కిలో) 100, బరబాటి 52, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 80, కీరదోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 70, దేముడుచిక్కుడు 68, గోరుచిక్కుడు 34, ఆగాకార దేశవాళీ 100, ఆగాకర హైబ్రిడ్ 100, కూర పెండలం 44, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బూడిద గుమ్మడికాయ 34, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

పందెం కోళ్లు

పుంజులకు ప్రత్యేకమైన ఆహారం

- శరీరం దృఢంగా ఉండేలా జాగ్రత్తలు
- ఒక్కో పుంజు కనిష్ఠంగా రూ.15 వేలు, గరిష్ఠంగా రూ.లక్షపైనే



సంక్రాంతి వచ్చేసింది. పండుగ సంబరాలకు వన్నెతెచ్చేలా కోడిపందాల నిర్వహణకు పల్లెలు సిద్ధమయ్యాయి. సంక్రాంతి నుంచి ప్రారంభమయ్యే కోడిపందాలకు పందెం రాయుళ్లు తమ పుంజులను సిద్ధం చేశారు. గోదావరి జిల్లాల స్థాయిలో భారీగా, బహిరంగంగా కాకపోయినా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గోప్యంగా సంక్రాంతి సమయంలో పందాలు నిర్వహిస్తుంటారు. కొత్త సంవత్సరం ప్రారంభంలో వచ్చే సంక్రాంతి పండుగ, ఆపై వరుసగా వేసవి ముగిసేంత వరకూ కొనసాగే గ్రామ దేవతల తీర్థాల్లో కోడిపందాలు వేస్తుంటారు.

- చోడవరం, ఆంధ్రజ్యోతి

కోడి పందాల నిర్వహణపై పోలీసుల ఆంక్షలు ఉన్నప్పటికీ గ్రామాల్లో ఏదో ఒక సమయంలో గంటల వ్యవధిలో వీటిని పూర్తిచేస్తుంటారు. ఏళ్ల తరబడి వస్తున్న ఈ ఆచారం ఈ ఏడాదీ కొనసాగనుంది. ఈ పోటీలకు తగినట్టుగానే పందాల్లో పాల్గొనే కోడి పుంజుల ధరలు కూడా కళ్లు చెదిరే విధంగా ఉండడం విశేషం.

పందెం పుంజులు...రకాలు ఎన్నెన్నో...

పందాలకు కోడిపుంజులను సిద్ధం చేయడం ఓ ప్రత్యేక క్రతువు. పందాలకు దించే పుంజుల రకాలు, వాటికి ఇచ్చే ఆహారం, శిక్షణ ఇలా ప్రతి అంశం ఆసక్తికరంగా ఉంటాయి. పందెం కోళ్లు కాస్త విభిన్నంగా ఆకర్షణీయంగా ఉంటాయి. సాధారణ కోడిపుంజుల కంటే దృఢంగా ఉంటాయి. ఆకారం, రంగు, ఎత్తు, ఈకలు, శరీర నిర్మాణాన్ని బట్టి వివిధ రకాల పేర్లు ఉంటాయి. ప్రధానంగా పందాల్లో పాల్గొనే పుంజుల్లో ఎక్కువగా డేగ, డేగ పర్ల, నల్ల నవల, పూల, పింగళ, సేతువ, నల్ల పాశ, మైల, కాకి, పచ్చకాకి, పెట్టమర్రి, అబ్రుసు, గేరువ తదితర రకాలు ఉన్నాయి. కనిష్ఠంగా ఒక్కో పుంజు ధర 15 వేల నుంచి గరిష్ఠంగా లక్ష రూపాయలకుపైగా పలుకుతుంది. ఉమ్మడి జిల్లాలో కోడి పందాలు ఎప్పటి నుంచో డింకీ లేదా కత్తి కట్టడం...రెండు రకాలుగా నిర్వహిస్తున్నారు. చివరి వరకూ బరిలో ఏది నిలిచి ఉంటుందో అది విజేత. గ్రామాల్లో పరిస్థితులు, పోలీసుల నిఘా సమయానుకూలతల ఆధారంగా ఏ రకమైన పందాలు నిర్వహించాలనేది నిర్వాహకులు నిర్ణయిస్తుంటారు.

పుంజులు... పలు రకాలు

పందెం కోడిపుంజులను వాటి ఈకలు, ఆకారాన్ని బట్టి రకరకాల పేర్లతో పిలుస్తారు. ఎరుపు రంగులో ఉండి, ఈకలు డేగ మాదిరిగా ఉంటే దానిని డేగ అంటారు. నీలం రంగులో ఉంటే కాకిగా, మెడ వద్ద పసుపు రంగులో ఉండి ఇతర భాగం తెల్ల రంగులో ఉంటే తెల్ల సవల, నల్లరంగులో ఉంటే నల్ల సవలగా పరిగణిస్తారు. బంగారు వర్ణంలో ఉండే పచ్చకాకిగా పిలుస్తారు. కొన్నింటికి తోకలు నెమలి మాదిరిగా ఉంటాయి. వాటిని కాకి నెమలిగా పిలుస్తారు. ఇంకా మైల, సవల, నెమలిడేగ, కోడి డేగ, గట్టిడేగ, చింతపిక్క రంగుడేగ, కోడినెమలి, నెమలి, కాకి, గట్టికాకి, సుద్దకాకి, కోడికాకి, నెమలి కాకి, కుసునలుపు కాకి, పచ్చకాకి, పూల, సేతువ, తెల్లసేతువ, నల్లబొట్లసేతువ, గేరువ, చిక్కని గేరువ, పండు గేరువ, ఇటుక గేరువ, అబ్రుసు, రసంగి, పువల, తెల్లపువల, భోగ, కొత్తభోగ తదితర రకాలున్నాయి.

క్రమపద్ధతిలో ఆహారం, శిక్షణ

పందాలకు పుంజులను సిద్ధం చేసే తీరు ప్రత్యేకంగా ఉంటుంది. వీటికి ఇచ్చే ఆహారం ఖర్చుతో కూడిన వ్యవహారం. జీడిపప్పు, బాదం పిస్తా, ఎండు ఖర్జూరం, కిస్‌మిస్, కోడిగుడ్డులో తెల్లసొన, మేక నల్ల ఇస్తుంటారు. గోధుమలు, దంపుడు బియ్యం, రాగులు, గంట్లు, మినపపప్పు, శెనగపప్పు కలిపిన మిశ్రమం పెట్టి దృఢంగా మారుస్తారు. కొందరు బలానికి టాబ్లెట్లు కూడా వాడుతుంటారు. ఈ పుంజులకు పెట్టే ఆహారానికి అయ్యే ఖర్చు వారానికి రూ.2 వేల వరకు ఉంటుంది. పందాల కోసం కోడిపుంజులకు కఠోర శిక్షణ ఉంటుంది. రోజూ పరిగెత్తించడం, స్విమ్మింగ్, మసాజ్ శిక్షణలో ఓ భాగం. ఉదయాన్నే పరిగెత్తించిన అనంతరం పచ్చి కోడిగుడ్డు తెల్లసొన తినిపించి విశ్రాంతి ఇస్తారు. ఆ తరువాత జీడిపప్పు, బాదంపప్పు, ఎండు ద్రాక్ష, ఎండు ఖర్జూరం, నల్లజీలకర్ర, తెల్ల జీలకర్ర, గసగసాలు దంచిన మిశ్రమాన్ని తినిపిస్తారు. రెండు గంటల పాటు విశ్రాంతి అనంతరం నీటిలో ఈత కొట్టిస్తారు. సాయంత్రం కట్టెల మంటపై మట్టిపిడత వేడి చేసి ఆవేడిని ఓ గుడ్డకు పట్టించి కోడి తలకు, ఒంటికి, కాళ్లకు మసాజ్ చేస్తారు. రాత్రికి మంచి ఆహారం ఇస్తారు. ఏదిఏమైనా కోడి పందాలు, పుంజుల పెంపకం గ్రామీణ సంస్కృతిలో భాగమైపోయింది.



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న గాజువాక ప్రధాన రహదారి



దువ్వాడ స్టేషన్‌లో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

సంక్రాంతి సందడి

- రద్దీగా మారిన బస్టాపులు, దువ్వాడ రైల్వే స్టేషన్
- కొనుగోలుదారులతో కిటకిటలాడిన వస్త్ర దుకాణాలు
- స్తంభించిన గోపాలపట్నం ప్రధాన రహదారి

గాజువాక/కూర్మన్నపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు సెలవులు రావడంతో అత్యధికులు సంక్రాంతి పండగ నిమిత్తం తమ సొంతూళ్లకు బయలుదేరడంతో పారిశ్రామిక ప్రాంతంలోని బస్టాప్‌లు, దువ్వాడ రైల్వే స్టేషన్ రద్దీగా దర్శనమిచ్చాయి. ప్రతి బస్సు జనంతో కిటకిటలాడుతూ వెళ్లింది. దువ్వాడ రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు సాగించిన రైళ్లన్నీ ప్రయాణికులతో నిండిపోయి కనిపించాయి. ప్రయాణికులను నియంత్రించేందుకు ఆర్పీఎఫ్ సిబ్బంది శ్రమించారు. మరోపక్క పండగ షాపింగ్ చేసే కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ కళకళలాడాయి.

ఆదివారం ఉదయం నుంచే గాజువాకలోని ప్రధాన షాపింగ్ మాల్స్‌తో పాటు చిన్న చిన్న వస్త్ర దుకాణాల్లో కొనుగోలుదారుల సందడి నెలకొంది. సాయంత్రమైతే గాజువాక మెయిన్ రోడ్డులో ఇసుక వేస్తే రాలనంతగా జనాలు ఉన్నారు. షాపింగ్ మాల్స్ చిన్నపాటి వస్త్ర దుకాణాలే కాకుండా ఫుట్‌పాత్‌పై దుస్తుల విక్రయాలు జోరుగా సాగాయి. దీంతో గాజువాక సినిమా హాల్ జంక్షన్ నుంచి కొత్త గాజువాక వరకు జన సందోహంతో నిండిపోయింది. .



గోపాలపట్నం ప్రధాన రహదారిలో నెలకొన్న రద్దీ

ఎక్కడ పడితే అక్కడ వాహనాల పార్కింగ్

పండగ షాపింగ్‌కు వచ్చిన జనాలు ఇటు పాత గాజువాక కూడి నుంచి అటు కొత్త గాజువాక వరకు ఎక్కడ పడితే అక్కడ తమ వాహనాలను పార్కింగ్ చేయడం, ఇదే మార్గం గుండా ఇతర వాహనాలు రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. సాయంత్రం నుంచి ఈ సమస్య మరింత జఠిలంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.

జనసంద్రంగా మారిన గోపాలపట్నం రోడ్డు

గోపాలపట్నం: సంక్రాంతి పండగ సందర్భంగా ప్రధాన రోడ్డులో ఉన్న వ్యాపార సముదాయాలకు వచ్చిన కొనుగోలుదారులతో గోపాలపట్నం ప్రధాన రహదారి స్తంభించిపోయింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. షాపింగ్‌మాల్స్, చిన్న చిన్న వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. వాహనాలు రద్దీ అధికంగా ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారిలో నెలకొన్న ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో నగరం నుంచి వచ్చే వాహనాలను సదరం అప్పలనాయుడు మార్గంలోకి మళ్లించారు. రాత్రి పది గంటల వరకు ఫుట్‌పాత్ వ్యాపారాలు కూడా జోరుగా సాగాయి. చాలామంది లింక్ రోడ్లలో తమ వాహనాలను పార్కింగ్ చేయడంతో సందుల్లోనూ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. అదేవిధంగా పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చిన వారితో రైతు బజారు కిటకిటలాడింది. సాధారణ రోజుల్లో రోజుకు సుమారు రెండు వేల మందికి పైగా కొనుగోలుదారులు వస్తుంటారు. కాగా పండగ నేపథ్యంలో ఆదివారం సుమారు ఐదు వేల మందికి పైగా వచ్చినట్టు అంచనా.

స్వామి వివేకానంద ఆశయాలు యువతకు ఆదర్శం: మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

- పలుచోట్ల ఘనంగా జయంతి

కూర్మన్నపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద ఆశయాలు యువతకు మార్గదర్శకం కావాలని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. గ్రేటర్ 70వ వార్డు పరిధి ఎల్వీ నగర్‌లో ఆదివారం నిర్వహించిన వివేకానంద జయంత్యుత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ వివేకానందుని బోధనలను నేటి యువతరం అనుసరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పొలిమేర శ్రీనివాసరావు, దీనంకొండ కృష్ణంరాజు, డి.పావని, బాటా శ్రీనివాసరావు, పి.సంతోశ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువు కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత, సాహిత్యసుధ వ్యవస్థాపకులు అద్దంకి రాఘవాచార్యులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. అనంతరం వివేకానంద జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో సమన్వయకర్త జీలకర్ర రమణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు దుర్గాప్రసాద్, భువనేశ్వరీదేవి, జి.గురప్పరెడ్డి, నాగబాబు శర్మ, భవానీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక శాఖా గ్రంథాలయంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాధవ్, తదితరులు

అక్కిరెడ్డిపాలెం: స్వామి వివేకానంద ఆశయాలను నేటి యువత తెలుసుకోవడంతో పాటు వాటిని ఆచరించేందుకు ప్రయత్నించాలని మార్కండేయ యువజన సంఘం కార్యదర్శి గిడుతూరి అప్పారావు అన్నారు. తుంగ్లాంలోని మార్కండేయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో నాయకులు నావన వెంకట అప్పారావు, కొల్లి గంగరాజు, పి.కనకారావు, ఎస్.అప్పారావు, నేమాల సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: గ్రేటర్ 59వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వివేకానంద చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయ్‌బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి వివేకానంద అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పారావు, హేమారావు, సింహాచలం, జోగారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మల్కాపురం శాఖా గ్రంథాలయంలో వివేకనందుని చిత్రపటానికి జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి పుష్పమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో రచయిత సత్తిరాజు, జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవి, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: చినముషిడివాడలోని శారదా పీఠం సమీపంలో గల స్వామి వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన వివేకానంద ఫండ్ ద్వారా పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాగా పలువురు విద్యార్థులు వివేకానందుని వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి చందన, ఉపాధ్యాయులు చంద్రకళ, మహేశ్, లావణ్య, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల శాఖా గ్రంథాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి సూర్యకుమారి, సమాజహిత నరసింహం కొడుగంటి, పి.భూలోకరావు, డి.ప్రభాకర్, జానకీరామ్, తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద వేషధారణలో ఉన్న చిన్నారికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

యువతకు క్రీడా స్ఫూర్తి అవసరం: పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జనవరి 12 (ఆంధ్రజోతి): సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, నేటి యువతకు క్రీడా స్ఫూర్తి ఎంతో అవసరమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన మణి యాదవ్ మెమోరియల్ విండ్ బాల్ టోర్నమెంట్ విజేత జట్లకు ఆయన ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు సమాజంలో మంచి గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు చట్టి గోపి, తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానాన్ని వేమన ఐటీఐ జట్టు, ద్వితీయ స్థానాన్ని దేవాడ జట్టు కైవసం చేసుకున్నాయి.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు

పెందుర్తి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6,7,8,9 తేదీల్లో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహా సభల పోస్టర్‌ను ఆదివారం సుజాతనగర్‌లోని గిరిప్రసాద్ నగర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెంగువ అచ్యుతరావు, వై.రాంబాబుతో పాటు తరుణ్, మహేశ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



రన్‌లో పాల్గొన్న ప్రభుత్వ విప్ గణబాబు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, తదితరులు

ఉత్సాహంగా సాగిన 5కే రన్

మల్కాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం వివేకానంద యూత్ ఆధ్వర్యంలో గాజువాక ఆర్టీసీ డిపో నుంచి మల్కాపురం జంక్షన్ వరకు సాగిన 5కే రన్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. తొలుత స్వామి వివేకానంద విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గణబాబు మాట్లాడుతూ వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మంచిదని, అందువల్ల ప్రతిఒక్కరూ రోజూ కనీసం అరగంటైనా వ్యాయామం చేయాలని సూచించారు. కాగా 5కే రన్‌లో ఉత్తరాది రాష్ట్రానికి చెందిన వారితో పాటు పరసర ప్రాంతాలకు చెందిన యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, నాయకులు పోలిమేర శ్రీను, కొక్కిలిగడ్డ విజయ్‌బాబు. నక్కా లక్ష్మణరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ సిటీ శ్రీవారికి పుష్పయాగం



కూర్మన్నపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గ్రీన్ సిటీలోని వేంటేశ్వరసామికి ఆదివారం పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బండి సురేశ్‌కుమార్, వీవీ కృష్ణారావు, సుబ్రహ్మణ్యం, సురేశ్, పద్మావతి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: గ్రేటర్ 65వ వార్డు పరిధి గరుడాద్రిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరాలయంలో ఈ నెల 14న జరగనున్న గోదాదేవి, శ్రీ రంగనాయకుల కల్యాణానికి సంబంధించిన రాట ఉడుపు ఉత్సవాన్ని ప్రదీప్ చంద్ర, తాతాచార్యులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, సభ్యులు మంత్రి సత్యనారాయణ, మంజుల, విజయ శంకర్ పూర్ణ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి ఉత్సవమూర్తితో పురవీధుల్లో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పెందుర్తి కూడలి నుంచి వెంకటాద్రి శిఖరం వరకు ప్రత్యేక పూల రథంలో సాగిన తిరువీధి ఉత్సవంలో తోడిపెద్దు ముందు నడవగా భజనలు, మంగళవాయిద్యాలు, కోలాటం, తప్పెట గుళ్లు, తదితర సాంస్కృతిక కార్యక్రమాల మధ్య తిరువీధి సాగింది. 1,008 మహిళలు వివిధ పండ్లు, స్వీట్లను సారెగా తెచ్చి గోదాదేవికి నివేదించారు. అంతకుముందు వెంకటాద్రి ఆలయంలో తిరుప్పావై పారాయణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

అగనంపూడి: జీవీఎంసీ 79 వార్డు పరిధి శాంతినగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి ప్రధాన అర్చకులు సత్యనారాయణ ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. పాశురాన్ని చదివి వినిపించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తి గీతాలను ఆలపించారు. కాగా ఈ నెల 14న గోదాదేవి, రంగనాథుల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త ఈకే చారి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎం.ఉమామహేశ్వరరావు, కృష్ణారావు, సాయిబ్‌నాయుడు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట/ఎన్.ఎ.డి.జంక్షన్: నాయుడతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో ధనుర్మాస వేడుకలు వైభవంగా జరుగుతు న్నాయి. ఇందులో భాగంగా ఉదయం తిరుప్పావై ప్రవచనం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గోదాదేవికి భక్తులు వివిధ రకాల స్వీట్లతో పురవీధుల్లో సారె ఊరేగింపు నిర్వహించాక నివేదించారు. సోమవారం ఉదయం పది గంటలకు గోదాదేవి కల్యాణాన్ని నిర్వహిస్తామని అర్చకులు శ్రీనివాసస్వామి తెలిపారు. అలాగే విమాన్‌నగర్‌లో వైకుంఠ వేంకటేశ్వరాలయలో స్వామికా పంచామృతాభిషేకం, పూజలు జరిపారు.

తిరుపతి దుర్ఘటన క్షతగాత్రుల చెక్కులు అందజేత



పల్లా శ్రీనవాసరావుకు చెక్కులు అందజేస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు

గాజువాక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి దుర్ఘటనలో క్షతగాత్రులైన 15 కుటుంబాలకు అందించాల్సిన చెక్కులను టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, జంగా కృష్ణమూర్తి, ఎంఎస్.రాజు, జానకీదేవి, ముని కోటేశ్వరరావు, మహేందర్‌రెడ్డిలు ఆదివారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అందజేశారు. ఉత్తరాంధ్రకు చెందిన 15 మంది క్షతగాత్రులకు ఈ చెక్కులను అందజేయనున్నారు. క్షతగాత్రులకు మానవీయ కోణంలో అండగా నిలుస్తామని వారమన్నారు. వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేపాడ చిరంజీవిరావు, తదితరులు పాల్గొన్నారు.

అనాథల సేవలో 'హెల్పింగ్ హ్యాండ్స్'

పెందుర్తి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో భాగంగా ఇక్కడి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ఆదివారం పలువురు అనాథ వృద్ధులు, మానసిక దివ్యాంగులకు క్షురకర్మ (హెయిర్ కటింగ్) చేశారు. స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను ఆధ్వర్యంలో సుమారు 120 మంది వృద్ధులు, మానసిక దివ్యాంగులకు హెయిర్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సిరిమల్ల గణేశ్, నవీన్, సురేశ్, వాసు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భెల్ క్రికెట్ పోటీల విజేత గ్రీన్ పార్కు లెవెన్ జట్టు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయీస్ సన్స్ క్రికెట్ ట్రోఫీని భెల్ గ్రీన్ పార్కు లెవన్ జట్టు కైవసం చేసుకుంది. భెల్ హెచ్‌పీవీపీ హార్ట్‌ఫుల్ ఫ్రెండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భెల్ క్రీడా మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న భెల్ హెచ్‌పీవీపీ ఎంప్లాయీస్ సన్స్ క్రికెట్ ట్రోఫీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఎనిమిది జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో గ్రీన్ పార్కు లెవెన్ జట్టు బెల్ డంగల్ జట్టుపై ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. విజేతల జట్టుకు 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి బహుమతుల అందజేశారు. ఇటువంటి పోటీలు స్నేహబంధాన్ని పొంపొందిస్తాయమన్నరు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గొల్లవిల్లి శ్రీనివాస్, కె.రాము, ఎ.నానిబాబు, జె.రాము, కొరియోగ్రాఫర్ మాస్టర్ రమేశ్, పల్సర్ రూన్సీ, ఎం.కుమార్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లంకా మైదానంలో సంక్రాంతి సంబరాలు

గాజువాక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి లంకా మైదానంలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇక్కడ పల్లె వాతావరణాన్ని తలపించేలా సెట్లు ఏర్పాటు చేశారు. అలాగే తొలిరోజు భోగి సందర్భంగా ముగ్గుల పోటీలు, గోదాదేవి కల్యాణం, సాయంత్రం రేలారేలా కార్యక్రమం, డ్యాన్స్ షో, 14న వంటల పోటీలు, ఉత్తరాంధ్ర కళల ప్రదర్శన, 15న కోలాటం, 16న లోకల్ షోస్, చిన్నారులకు ట్రెడిషనల్ డ్రెస్ కాంపిటీషన్ వంటి కార్యక్రమాలు జరగనున్నాయి.

వాల్తేరు రైల్వేలో ప్రపంచ హిందీ దినోత్సవం



హిందీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ హిందీ దినోత్సవం సందర్భంగా ఆదివారం వాల్తేరు డివిజన్ కార్యాలయంలో సెమినార్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎ గ్లోబల్ వాయిస్ ఆఫ్ యూనిటీ అండ్ కల్చరల్ ప్రైడ్ అనే అంశంపై జరిగిన సెమినార్‌లో సాహిత్య వేత్తలు హిందీ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం హిందీ క్యాలెండర్ 2025ను డీఆర్ఎం మనోజ్ కుమార్ సాహు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాష మాట్లాడే, అర్థం చేసుకునేవారు 500 మిలియన్లకు పైగా ఉన్నారని పేర్కొన్నారు. హిందీ భాష ఉనికి ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. చరిత్రలో సంస్కృతి, సంప్రదాయాలకు హిందీ ఏకీకృత శక్తిగా పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు రైల్వే వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు చేయూత



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న చారిటీబాక్స్ ప్రతినిధులు

మహారాణిపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా చారిటీ బాక్స్ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆదివారం నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ స్వచ్ఛంద సంస్థ నగరంలోని మహారాణిపేట వన్‌టౌన్ బీచ్‌రోడ్డు, వాల్తేర్, తాటిచెట్లపాలెం, శివాజీపాలెం తదితర ప్రాంతాల్లో పేదలకు 15 రకాల వస్తువులను పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి పొట్నూరు వెంకటరమణ మాట్లాడుతూ తెలుగు లోగిళ్లలో సంక్రాంతి పండుగకు ప్రత్యేక స్థానం ఉందని, పేద, ధనిక తేడా లేకుండా పండుగను జరుపుకొంటారని, దీనిని దృష్టిలో పెట్టుకొని చారిటీబాక్స్ సంస్థ తరుపున పేదలకు, నిరాశ్రయులకు నిత్యావసర వస్తువులు అందచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడికొండ కరుణాకర్, కొంతం శివాజీ ప్రసాద్, లక్కోజు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తేలేం..ప్రాణప్రదంగా చూసుకుంటాం

- తిరుపతి తొక్కిసలాటలో మృతిచెందినవారి కుటుంబాలకు హోంమంత్రి భరోసా
- ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి పరామర్శ
- పిల్లల భవిష్యత్‌పై హామీ



తిరుపతి ఘటనలో మృతిచెందిన మద్దిలపాలెం వాసి రజిని తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న నేతలు, చిత్రంలో హోంమంత్రి అనిత తదితరులు

అక్కయ్యపాలెం/కంచరపాలెం/మద్దిలపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందిన సూరిశెట్టి లావణ్య స్వాతి, కండిపిల్లి శాంతి, గుడ్ల రజినిల ప్రాణాలు తీసుకు రాలేం...కానీ.. వారి పిల్లలను ప్రాణప్రదంగా చూసుకుంటూ, భవిష్యత్ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర హోంశాఖమంత్రి వంగలపూడి అనిత భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాల్లో ఒక్కొక్కరికి టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగం, వారి పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు వివరాలు సేకరించామని తెలిపారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి తదితరులతో కలిసి ఆమె ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల వంతున నష్టపరిహారం చెక్కులను అందజేసి పిల్లలను ఓదార్చారు. తాటిచెట్లపాలెం వేంకటేశ్వరకాలనీలో నివాసం ఉంటున్న లావణ్య భర్త సతీష్, పిల్లలు శ్రీలాస్య, కీర్తిశ్రీల బాగోగులు తెలుసుకుని ఇద్దరు పిల్లల చదువు పూర్తయ్యేవరకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందన్నారు. శ్రీలాస్య, కీర్తిశ్రీలకు చెరో రూ.10 లక్షల వంతున బ్యాంకులో ఫిక్స్‌డు డిపాజిట్ చేసినట్లు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తెలిపారు. రూ. 5 లక్షలను లావణ్య భర్త సతీష్‌కు ఇచ్చామన్నారు. టీటీడీ సభ్యుడు ప్రశాంత్ రెడ్డి రూ.2 లక్షలు, ఎంఎస్ రాజు రూ.50 వేలు అందించారని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్ కోసమే బ్యాంకులో ఫిక్స్‌డు డిపాజిట్ చేశామన్నారు. కంచరపాలెం ప్రాంతానికి చెందిన మృతురాలు కండిపిల్లి శాంతి భర్తకు రూ.7 లక్షలు, కుమారుడికి రూ.18 లక్షలు ఇచ్చినట్లు వెల్లడించారు.

ఇల్లు మంజూరు చేయరూ!

కంచరపాలెం స్థానిక 48వ వార్డు ఇందిరానగర్‌లోని మృతురాలు కండిపిల్లి శాంతి ఇంటికి నేతలు పరామర్శకు వెళ్లిన సందర్భంగా ఆమె కుమారుడు మహేందర్ మాట్లాడుతూ తమకు ఉండటానికి ఇల్లు లేదని, ప్రభుత్వం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. శాంతి భర్త కండిపిల్లి వెంకటేష్, కుమారుడు మహేందర్‌కు చెక్కును అందించి హోంమంత్రి ధైర్యం చెప్పారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, నాయకులు నజీర్, పొలమరశెట్టి శ్రీనివాసరావు, బొడ్డేటి శ్రీదేవి, బొడ్డేటి మోహన్, గొర్లె అప్పారావు, జయశ్రీ, జనసేన ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, గంకల కవిత వారిని పరామర్శించారు.

దేశభక్తులను అందించే మిషన్ విజ్ఞాన్ విహార్

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

ఆనందపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : దేశభక్తులను అందించే మిషన్ విజ్ఞాన విహార్ పాఠశాల అని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం రాత్రి గుడిలోవలో జరిగిన పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో అనేక విద్యా సంస్థలు కేవలం మార్కుల కోసం విద్యార్థులను తయారు చేస్తుండగా ఇక్కడ మాత్రం ధైర్య సాహసాలు, విలువలతో కూడిన విద్య నేర్పుతున్నారని కొనియాడారు. సమాజం పట్ల బాధ్యత గల పౌరులను అందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూరావు మాట్లాడుతూ విజ్ఞాన విహార వంటి గొప్ప సంస్థలో పిల్లలను చదివించడం ఎంతో అదృష్టమని చెప్పారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ఈ పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యా భారతి అధ్యక్షుడు పి.వి. నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ కృష్ణకుమార్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'యూనివర్సిటీల్లో జీతాలు ఆపలేదు'

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో బోధన, బోధనేతర సిబ్బందికి యథావిధిగా జీతాలు అందుతున్నాయని, కొన్ని యూనివర్సిటీల్లో సాంకేతిక కారణాలతో ప్రక్రియ నిలిచిపోవడం మినహా ఎక్కడా జీతాలను ఆపలేదని ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి కార్యదర్శి టీవీఎస్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీల్లో జీతాలు ఆగిపోయాయనే ప్రచారంపై ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం, బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆంధ్రా యూనివర్సిటీలు సాంకేతిక కారణాలతో జీతాల బిల్లులు సకాలంలో అప్‌లోడ్ చేయలేదని, అందువల్ల అక్కడ జీతాలు ఆగాయన్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ నాలుగు వర్సిటీల్లోని సిబ్బందికి జీతాలు జమవుతాయని తెలిపారు.

ఊరెళితే సమాచారం ఇవ్వండి



బైండోవర్ కేసులు నమోదు చేసినవారికి కౌన్సెలింగ్ ఇస్తున్న వన్‌టౌన్ సీఐ దేముడుబాబు

జగదాంబ కూడలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పరిసర ప్రాంత నివాసితులు సంక్రాంతికి సొంతూళ్లు వెళితే తప్పనిసరిగా తాళం వేసిన ఇళ్లపై నిఘా వ్యవస్థ (లాక్ట్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్)ను వినియోగించుకోవాలని వన్‌టౌన్ సీఐ దేముడుబాబు సూచించారు. ఇంటికి తాళం వేసి ఊరెళితే జాగ్రత్తలు పాటించాల్సిందేనన్నారు. పండుగ రోజులు సొంతూరిలో ఆనందంగా గడుపుతూ, ఇక్కడ నివసిస్తున్న ఇంటిపై బెంగ లేకుండా ఉండేందుకు ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను ముందుగా మొబైల్‌లో డౌన్ లోడ్ చేసుకొని పేరు, ఫోన్ నెంబరు వివరాలతో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. అలా చేసిన వెంటనే పోలీసు సిబ్బంది వచ్చి రహస్య కెమెరా అమర్చుతారన్నారు. అందులో వ్యక్తుల కదలికలు నమోదవుతాయని, సొత్తు భద్రంగా ఉంటుందని పేర్కొన్నారు. పోలీసుల సూచనలు పాటించాలన్నారు. సంక్రాంతి పండుగకు పేకాట, కోడిపందాలు పూర్తిగా నిషిద్ధమని సీఐ అన్నారు. పాత నగరంలో ఎవరైనా పేకాట శిబిరాలు, కోడిపందాలు, ఇతర జూదాలకు తెరతీస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 94407 96019 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. 10 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. వన్‌టౌన్ పరిధిలో నిరంతరం పోలీస్ పర్యవేక్షణ ఉంటుందని సీఐ పేర్కొన్నారు.

నేర నియంత్రణపై అవగాహన ర్యాలీ

కంచరపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణపై ఎయిర్‌పోర్టు క్రైం పోలీసులు ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంచరపాలెం స్టేషన్ వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని క్రైం సీఐ ఎన్.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఊర్వశి జంక్షన్, బర్మాక్యాంపు, మెట్టు తదితర ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు. పండగలకు ఊళ్లు వెళ్లేవారు, ఇళ్లకు తాళాలు వేసినవారు పోలీసలకు సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానితులు వీధుల్లో సంచరిస్తే ప్రశ్నించాలని సూచించారు. సీసీ కెమేరాల ఏర్పాటు, కొత్త వ్యక్తులు వస్తే వివరాలు తీసుకోవడం తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సుదర్శనరావు, సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కరువు భత్యం పెంపు

మాధవధార, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు ట్రస్టు అథారిటీలో పని చేస్తున్న క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగులకు, కార్గో హ్యాడ్లింగ్ వర్కర్స్‌కు కరువు భత్యం 50 శాతం పెరిగిందని హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.అప్పారావు తెలిపారు. పెరిగిన కరువు భత్యం 2025 జనవరి 1 నుంచి అందుతుందన్నారు. దీనికి అనుగుణంగా పెన్షనర్లకు 2 శాతం కరువు భత్యం పెరిగినట్లు ఆయన తెలియజేశారు. క్లాస్ 1, 2 అధికారులకు 1.9 శాతం జనవరి నెల జీతంలోనే కలిపి చెల్లిస్తారని పేర్కొన్నారు. మేజర్ పోర్టుగా ఉన్న విశాఖపట్నంలో పని చేస్తున్న క్లాస్ 3, 4 ఉద్యోగులకు 2022 జనవరి 1 నుంచి బకాయిలు చెల్లించాలని పోర్టు యాజమాన్యంతో సంప్రదించినట్లు అప్పారావు కోరారు.

పండుగను బాగా జరుపుకోవాలి

డాబాగార్డెన్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి పెద్ద పండుగ మకర సంక్రాంతి అని ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఫంక్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ డైమండ్స్ ఆధ్వర్యంలో పండుగ విశిష్టత అనే అంశంపై రాజశేఖర్ ప్రసంగించారు. మన సంస్కృతిలో భాగమైన సంక్రాంతి పండుగను అందరూ ఉత్సాహంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. సంస్థ తరఫున ఆయనను సత్కరించారు. సంస్థ అధ్యక్షురాలు ఆర్.నీరజ, కార్యదర్శి ఎస్.కామేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

బస్సులు కిటకిట

...3వ పేజీ తరువాయి

సర్వీసులు నడిపారు. ప్రయాణికుల డిమాండ్ ఉంటే రాత్రి సమయంలోనూకూడా బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు. సోమవారం కూడా ఇదే రద్దీ కొనసాగే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

రైలు ప్రయాణికులకు ప్రత్యేక సదుపాయాలు

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు రైల్వే అధికారులు అదనపు సదుపాయాలు కల్పించారు. జనరల్ టికెట్ బుకింగ్‌కు అదనపు కౌంటర్లు, ఆటోమెటిక్ వెండింగ్ మిషన్లను ఉంచారు. అదనపు సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసి రైళ్ల రాకపోకలపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. తాగునీరు, క్యాటరింగ్ సేవలు విస్తృతం చేశారు. ఆర్పీఎఫ్ దళాలు 24 గంటలు గస్తీ నిర్వహిస్తున్నాయన్నారు. వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామన్నారు.

కరాటే టోర్నీకి బాలసూర్య, ప్రవల్లిక



క్రీడాకారులను అభినందిస్తున్న క్రీడాశాస్త్రం విభాగాధిపతి పల్లవి

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషులు, మహిళల కరాటే చాంపియన్స్ టోర్నీకి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి బాలసూర్య, సీహెచ్. ప్రవల్లిక అర్హత సాధించారు. ఇటీవల జరిగిన సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ కరాటే టోర్నీ పురుషుల విభాగంలో బాలసూర్య (బుల్లయ్య కాలేజి), మహిళల విభాగంలో ప్రవల్లిక పతకాలు సాధించి ఆలిండియా వర్సిటీ టోర్నీకి ఎంకయ్యారు. ఈ నెల 15 నుంచి రోహతక్‌లో జరిగే అఖిల భారత అంతర్ వర్సిటీ టోర్నీలో ఏయూ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ పాల్గొని క్రీడాకారులతోపాటు కోచ్ చిన్నారావును అభినందించి ప్రతిష్ఠాత్మక ఆలిండియా టోర్నీలో పతకాలు సాధించి ఏయూ ఖ్యాతిని పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ పల్లవి, దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దొరబాబు పాల్గొన్నారు.

అమేయకు నేషనల్ యూత్ ఐకాన్ అవార్డు



అవార్డు అందుకున్న అమేయతో కేంద్ర మంత్రి జోయల్ ఓరమ్ తదితరులు

విశాఖపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన జాతీయ యువజనోత్సవంలో నగరానికి చెందిన ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారిణి లగుడు అమేయ నేషనల్ యూత్ ఐకాన్ 2025 అవార్డు అందుకున్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జోయల్ ఓరమ్ చేతుల మీదుగా ఈ అవార్డు తీసుకున్నారు. అమేయ శాస్త్రీయ నృత్య కళాకారిణిగా వందకు పైగా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రదర్శనలిచ్చారు. ఇప్పటివరకు 8 అంతర్జాతీయ, 9 జాతీయ, 18 రాష్ట్రస్థాయి అవార్డులు పొందారు. గిన్నీస్ వరల్డ్ రికార్డ్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, పది ప్రపంచ రికార్డులు సాధించారు.

నృసింహ దీక్షలు విరమణ



క్యూలో ఉన్న స్వాములు

సింహాచలం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దీక్షలు చేపట్టిన భక్తులు ఆదివారం మాల విసర్జన చేశారు. గత ఏడాది డిసెంబరు 2న మండల దీక్షలు, 12న ద్వాత్రింశతి (32 రోజులు) దీక్షలను అప్పన్న ఆలయ అర్చకుల చేతుల మీదుగా వేలాది మంది భక్తులు స్వీకరించారు. ఆదివారం వేకువజామున సింహగిరికి చేరుకున్న చందనస్వాములు స్వామివారిని దర్శించుకుని, తిరుముడులు సమర్పించారు. దీక్షల విరమణ పురస్కరించుకుని దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆదేశాల మేరకు అధికారులు ఉచిత రవాణా, దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఒకరోజు వసతి, భోజన సదుపాయం కల్పించారు.

టీడీపీ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు



టీడీపీ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

మహారాణిపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ ఆధ్వర్యంలో సంప్రదాయ దుస్తులు ధరించి నాయకులు, కార్యకర్తలు వచ్చారు. తొలుత ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి భోగిమంట వేసి ఆహ్లాదకర వాతావరణంలో వేడుకలు జరుపుకున్నారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎస్.కోట ఎమ్మెల్యేల కోళ్ల లలిత కుమారి, దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, పార్టీ నగర కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, నక్కా కనకరాజు, గొర్లె శ్రీనివాస నాయుడు, రవికుమార్, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు సెలవిక!

... 3వ పేజీ తరువాయి

నీల కుండీలు జంక్షన్ నుంచి సింహాచలం వరకు ఆరు కిలో మీటర్లు, భీమిలి నుంచి దొరతోట జంక్షన్ వరకు ఎనిమిది కిలో మీటర్లు రోడ్డు, పద్మనాభం నుంచి నీల కుండీలు జంక్షన్ వరకు ఆరు కిలోమీటర్లు రోడ్లపై గుంతలు పూడ్చివేశారు. ఇక రాష్ట్ర రహదారుల విషయానికి వస్తే అల మండ రైల్వేస్టేషన్ నుంచి పాండ్రంగి మార్గంలో ఆరు కిలోమీటర్లు, తగరపువలస మహరాజుపేట జంక్షన్ నుంచి పద్మనాభం వరకు 11 కిలోమీటర్లు, సింహాచలం దొబ్బ రోడ్డు నాలుగు కిలోమీటర్లు, అడవివరం నుంచి బొడ్డునాయుడుపాలెం పది కిలోమీటర్లు, పద్మనాభం మండలంలోని చిన్నాపురం జంక్షన్ నుంచి నేరెళ్లవలస ఐదు కిలో మీటర్లు, భీమిలి మండలం తగరపువలస నుంచి తాటితూరు ఐదు కిలోమీటర్లు, బోని జంక్షన్ నుంచి పాండ్రంగి వరకు ఐదు కిలోమీటర్లు, గుడివాడ నుంచి అన్నవరం వరకు ఐదు కిలోమీటర్లు గుంతుల పూడ్చివేత పనులు సాగుతున్నాయి. వీటిలో రెండు చోట్ల 70 శాతం పూర్తయినట్టు అధికారులు తెలిపారు.

విశాఖలో గ్రావెల్ దొంగలు!

... 3వ పేజీ తరువాయి

వెళితే... ఆనవాళ్లు మినహా ఎవరూ కనిపించరు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రెచ్చిపోయిన ఈ వ్యక్తి ఇప్పుడూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. ఇతడికి కూటమి పార్టీలకు చెందిన చోటా నాయకులు, రెవెన్యూ, పోలీసుల అండ ఉందనే ఆరోపణలున్నాయి. శొంఠ్యాంలో స్థానిక ప్రజా ప్రతినిధికి గనుల శాఖ భారీ జరిమానా విధించినా అతడి అనుచరులు అక్రమాలను ఆపలేదు. గిడిజాల కొండ నుంచి వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వి విక్రయించిన మరికొందరు స్థానిక నాయకులు రూ.కోట్లు సంపాదించారు. జాతీయ రహదారికి ఆనుకుని వాణిజ్య సముదాయాలు, లేఅవుట్‌లు, ఇళ్ల నిర్మాణాలకు భారీగా గ్రావెల్, మట్టి అవసరం కావడంతో అక్రమార్కుల పంట పండుతోంది.

గుర్రంపాలెంలోనూ అంతే...

పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌లో వ్యాపారులకు కేటాయించిన ప్లాట్ల ఫిల్లింగ్‌కు తొలుత ఏపీఐఐసీకి చెందిన కొండను తవ్వేశారు. ఆ తరువాత పక్కనే ఉన్న రెవెన్యూకు చెందిన కొండను తవ్వుతున్నారు. అక్రమంగా గ్రావెల్ తవ్విన ఏడు పారిశ్రామిక సంస్థలకు గనుల శాఖ విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీచేశారు. అయినా మరికొందరు పారిశ్రామికవేత్తలు గ్రావెల్ తవ్వుతూనే ఉన్నారు. ఈ తవ్వకాలకు ఒకరిద్దరికి మాత్రమే పర్మిట్లున్నాయి. ఏపీఐఐసీకి చెందిన కొండను పరిరక్షించాల్సిన సంస్థ అధికారులు, సిబ్బంది ప్లాట్ల యజమానులతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలున్నాయి. విచిత్రమేమిటంటే కొండలు తవ్వేసిన తరువాత హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఏపీఐఐసీ కేటాయించిన ప్లాట్ల ఫిల్లింగ్, సమీపంలో గుట్ట, రెవెన్యూకు చెందిన కొండలో అక్రమతవ్వకాలపై వాస్తవాలు వెలుగులోకి రావాలంటే గూగుల్ మ్యాపులు పరిశీలించాలనే వాదన వినిపిస్తోంది. దీంతో పాటు గ్రావెల్ తవ్వకాల వ్యవహారంలో ఏపీఐఐసీ అధికారుల నిర్వాకంపై విచారణ చేపట్టాలని గండిగుండం, గుర్రంపాలెం గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఫలించిన ఎంపీ కృషి

...3వ పేజీ తరువాయి

కార్గో రవాణా జరిగిన విమానాశ్రయంలో ఈ సేవలు నిలిచిపోయాయి.

కేంద్రంతో నిరంతర చర్చలు

ఎయిర్‌కార్గో సేవలు నిలిచిపోవడంతో పారిశ్రామికవేత్తలు సమస్యను ఎంపీ శ్రీభరత్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివరించారు. ఎయిర్‌పోర్టు అధికారులు, అడ్వైజరీ కమిటీ సిఫార్సులను నివేదించారు. విమానయానశాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పరిష్కారం దిశగా పలుమార్లు సమావేశమయ్యారు. దీంతో ఎయిర్‌కార్గో సేవల పునరుద్ధరణకు అనుమతి లభించింది. ఈ క్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ కార్గో నిర్వహణ బాధ్యతలు స్వీకరించేందుకు ముందుకు వచ్చింది. ఎయిర్‌కార్గో సేవల ప్రారంభానికి అనుమతి లభించడం పట్ల ఎంపీ శ్రీభరత్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సేవలు పారిశ్రామిక రంగానికి ఊతమిస్తాయన్నారు. ఇక్కడి ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం ఉంటుందన్నారు. సేవల పునరుద్ధరణకు సహకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సేవల పునరుద్ధరణపై ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.కుమార్‌రాజా, ఒ.నరేష్‌కుమార్, డీఎస్ వర్మ హర్షం వ్యక్తం చేశారు.

నగరంలో కాలుష్యం

... 3వ పేజీ తరువాయి

ధూళి కణాల ప్రభావం పెరగడంతో పీఎం 2.5, పీఎం 10 పరిమితికి మించి నమోదవుతుందన్నారు. ఇది ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. పీఎం 2.5 అంటే కంటికి కనిపించని అత్యంత సూక్ష్మ ధూళి కణాలు. గాలి పీల్చుకున్నప్పుడు శరీరంలోనికి వెళ్లి ఊపిరితిత్తుల్లో సెటిల్ అవుతుంది. పీఎం 10 ధూళి కణాల పరిమాణం కొంచెం ఎక్కువ కనుక గాలి పీల్చినపుడు ముక్కుద్వారా వెళ్తే తుమ్ముల ద్వారా బయటకు వచ్చేస్తాయి. పోర్టు, పరిసరాల్లో పరిశ్రమల నుంచి వచ్చే ధూళి, భవన నిర్మాణాలు, వాహన కాలుష్యం ప్రమాదకరంగా ఉంది. నగరంలో 12 లక్షలకుపైగా ఉన్న వాహనాలలో కొంతవరకు కాలంచెల్లినవి. వీటినుంచి నల్లని పొగ రావడం కాలుష్యానికి కారణంగా పేర్కొంటున్నారు. భవన నిర్మాణ సమయంలో ధూళి కణాలు రాకుండా ప్రమాణాలు పాటించడంలేదు. చుట్టూ టార్పాలిన్ల ఏర్పాటు, నీటిని పిచికారీ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. రాత్రి కురిసే మంచు పగటి పూట ఎండకు పొడిగా మారి గాలుల ద్వారా నగరంలో అన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

వివేకానందుని బోధనలు అనుసరణీయం



వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న మధుకర్‌జీ, మాజీ ఎమ్మెల్సీ మాధవ్

పూర్ణామార్కెట్/డాబాగార్డెన్స్/అక్కయ్యపాలెం/మురళీనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వివేకానంద బోధనలు బాల్యం నుంచి అలవర్చుకోవాలని బాలవికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు నరవ ప్రకాష్ పేర్కొన్నారు. గ్రేటర్ 38వ వార్డులోని తమ కార్యాలయంలో వివేకానంద 162వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్రమశిక్షణతో కూడిన జీవితం, ఆత్మవిశ్వాసం, సర్వమత సమభావన స్వామి వివేకానంద బోధనల్లో ముఖ్యమైనవన్నారు.

దేశం గర్వపడే గొప్ప తత్వవేత్త

దేశం గర్వపడే గొప్ప తత్వవేత్త స్వామి వివేకానందుడని బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి ఎన్.మధుకర్‌జీ అన్నారు. ఆదివారం బీజేపీ విశాఖ జిల్లా ఆధ్వర్యంలో పాత జైలురోడ్డులో వివేకానంద విగ్రహం వద్ద జయంతి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జ్ నీలాపు విజయానందరెడ్డి అధ్యక్షత వహించారు. అతిథులుగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.మధుకర్‌జీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హాజరై వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రశ్నించే స్వభావం, తెలుసుకోవాలనే ఆసక్తి వివేకానందుని ప్రత్యేక వ్యక్తిగా తీర్చిదిద్దాయన్నారు. పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ స్వామీజీ దేశభక్తిని ప్రదర్శిస్తూ యువతను ప్రేరేపించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, పార్వతీపురం ఇన్‌చార్జ్ ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి, సభ్యులు బుద్ధ లక్ష్మీనారాయణ, డా. సుహాసిని ఆనంద్, ఎన్.గణపతిరావు, కురాడ పావని, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగం ధనేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, దాముయాదవ్, డి.నాగశివంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. భారత్ వికాస్ పరిషత్, ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా శాఖ సంయుక్తంగా 80 అడుగుల రోడ్డులోని శంకువానిపాలెంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరావు హాజరై వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు రమేష్ చంద్‌జైన్, ఎంవీవీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ, పేర్ల భాస్కరరావు, జీఎస్ఈ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు. స్వామి వివేకానంద జయంతి వేడుకల్ని ఆదివారం మురళీనగర్ ప్రశాంతి స్పిరిట్యుయల్ పార్కులో నిర్వహించారు. పార్కులో ఉన్న వివేకానందుని స్మారక విగ్రహం వద్ద కమిటీ అధ్యక్షుడు రత్నం అధ్యక్షతన వేడుకలు జరిపారు. అతిథులు వివేకానందుని స్మారక విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. స్వామి బోధనల అడుగు జాడల్లో నడుచుకోవాలని యువతకు సూచించారు. ఇలాంటి రోజును యువజన దినోత్సవంగా జరుపుకోవడం ఆనందదాయకమన్నారు.


జనార్దనరెడ్డితో వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

కేరమ్స్ పోటీల విజేతకు అభినందనలు

ఎంవీపీ కాలనీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నెల్లూరులో జరిగిన అఖిల భారత కేరమ్స్ సమాఖ్య కప్ పోటీల్లో పురుషుల సింగిల్స్‌లో చాంపియన్‌గా నిలిచిన నగరానికి చెందిన సీహెచ్ జనార్దనరెడ్డిని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ఆదివారం ఎంవీపీ కాలనీలో అభినందించారు. డబ్బై ఏళ్ల తర్వాత తెలుగు క్రీడాకారుడు ఆలిండియా చాంపియన్‌షిప్‌ను దక్కించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ప్రణవ్‌గోపాల్ ఆనందం వ్యక్తం చేశారు.

17 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

గురువిళ్ల అప్పన్నకు సంగీత కళాభారతి బిరుదు ప్రదానం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నాదస్వర విద్వాంసులు గురువిళ్ల అప్పన్నకు సంగీత కళాభారతి బిరుదుతో సత్కరించనున్నట్టు కళాభారతి ట్రస్టు అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. పిఠాపురంకాలనీ కళాభారతిలో ఆదివారం ఆయన త్యాగరాజ ఆరాధనోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కళాభారతిలో ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు త్యాగరాజ ఆరాధనోత్సవాలను నిర్వహిస్తామన్నారు. మూడు దశాబ్దాలుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తూ కళారంగాల్లోని ప్రముఖులకు బిరుదులు ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో ప్రదర్శనలకు 1,169 దరఖాస్తులు రాగా, వీటిలో 1,110 మందిని ప్రదర్శనలకు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు గుమ్మలూరి రాంబాబు, పి.గోపాలరావు, ఫైడా కృష్ణప్రసాద్, మల్లిక గ్రంధి, ఎంఎస్ శ్రీనివాస్, వీవీ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పెందుర్తి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6,7,8,9 తేదీల్లో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహా సభల పోస్టర్‌ను ఆదివారం సుజాతనగర్‌లోని గిరిప్రసాద్ నగర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెంగువ అచ్యుతరావు, వై.రాంబాబుతో పాటు తరుణ్, మహేశ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 14, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 56, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 46, బీరకాయలు 58, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండకాయలు 50, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 46, మునక్కాడలు (కిలో) 100, బరబాటి 52, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 80, కీరదోస 36, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 70, దేముడుచిక్కుడు 68, గోరుచిక్కుడు 34, ఆగాకార దేశవాళీ 100, ఆగాకర హైబ్రిడ్ 100, కూర పెండలం 44, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బూడిద గుమ్మడికాయ 34, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	102
లైవ్ ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

పందెం కోళ్లు

పుంజులకు ప్రత్యేకమైన ఆహారం

- శరీరం దృఢంగా ఉండేలా జాగ్రత్తలు
- ఒక్కో పుంజు కనిష్ఠంగా రూ.15 వేలు, గరిష్ఠంగా రూ.లక్షపైనే



సంక్రాంతి వచ్చేసింది. పండుగ సంబరాలకు వన్నెతెచ్చేలా కోడిపందాల నిర్వహణకు పల్లెలు సిద్ధమయ్యాయి. సంక్రాంతి నుంచి ప్రారంభమయ్యే కోడిపందాలకు పందెం రాయుళ్లు తమ పుంజులను సిద్ధం చేశారు. గోదావరి జిల్లాల స్థాయిలో భారీగా, బహిరంగంగా కాకపోయినా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గోప్యంగా సంక్రాంతి సమయంలో పందాలు నిర్వహిస్తుంటారు. కొత్త సంవత్సరం ప్రారంభంలో వచ్చే సంక్రాంతి పండుగ, ఆపై వరుసగా వేసవి ముగిసేంత వరకూ కొనసాగే గ్రామ దేవతల తీర్థాల్లో కోడిపందాలు వేస్తుంటారు.

- చోడవరం, ఆంధ్రజ్యోతి

కోడి పందాల నిర్వహణపై పోలీసుల ఆంక్షలు ఉన్నప్పటికీ గ్రామాల్లో ఏదో ఒక సమయంలో గంటల వ్యవధిలో వీటిని పూర్తిచేస్తుంటారు. ఏళ్ల తరబడి వస్తున్న ఈ ఆచారం ఈ ఏడాదీ కొనసాగనుంది. ఈ పోటీలకు తగినట్టుగానే పందాల్లో పాల్గొనే కోడి పుంజుల ధరలు కూడా కళ్లు చెదిరే విధంగా ఉండడం విశేషం.

పందెం పుంజులు...రకాలు ఎన్నెన్నో...

పందాలకు కోడిపుంజులను సిద్ధం చేయడం ఓ ప్రత్యేక క్రతువు. పందాలకు దించే పుంజుల రకాలు, వాటికి ఇచ్చే ఆహారం, శిక్షణ ఇలా ప్రతి అంశం ఆసక్తికరంగా ఉంటాయి. పందెం కోళ్లు కాస్త విభిన్నంగా ఆకర్షణీయంగా ఉంటాయి. సాధారణ కోడిపుంజుల కంటే దృఢంగా ఉంటాయి. ఆకారం, రంగు, ఎత్తు, ఈకలు, శరీర నిర్మాణాన్ని బట్టి వివిధ రకాల పేర్లు ఉంటాయి. ప్రధానంగా పందాల్లో పాల్గొనే పుంజుల్లో ఎక్కువగా డేగ, డేగ పర్ల, నల్ల సవల, పూల, పింగళ, సేతువ, నల్ల పాశ, మైల, కాకి, పచ్చకాకి, పెట్టమర్రి, అబ్రసు, గేరువ తదితర రకాలు ఉన్నాయి. కనిష్ఠంగా ఒక్కో పుంజు ధర 15 వేల నుంచి గరిష్ఠంగా లక్ష రూపాయలకుపైగా పలుకుతుంది. ఉమ్మడి జిల్లాలో కోడి పందాలు ఎప్పటి నుంచో డింకీ లేదా కత్తి కట్టడం...రెండు రకాలుగా నిర్వహిస్తున్నారు. చివరి వరకూ బరిలో ఏది నిలిచి ఉంటుందో అది విజేత. గ్రామాల్లో పరిస్థితులు, పోలీసుల నిఘా సమయానుకూలతల ఆధారంగా ఏ రకమైన పందాలు నిర్వహించాలనేది నిర్వాహకులు నిర్ణయిస్తుంటారు.

పుంజులు... పలు రకాలు

పందెం కోడిపుంజులను వాటి ఈకలు, ఆకారాన్ని బట్టి రకరకాల పేర్లతో పిలుస్తారు. ఎరుపు రంగులో ఉండి, ఈకలు డేగ మాదిరిగా ఉంటే దానిని డేగ అంటారు. నీలం రంగులో ఉంటే కాకిగా, మెడ వద్ద పసుపు రంగులో ఉండి ఇతర భాగం తెల్ల రంగులో ఉంటే తెల్ల సవల, నల్లరంగులో ఉంటే నల్ల సవలగా పరిగణిస్తారు. బంగారు వర్ణంలో ఉండే పచ్చకాకిగా పిలుస్తారు. కొన్నింటికి తోకలు నెమలి మాదిరిగా ఉంటాయి. వాటిని కాకి నెమలిగా పిలుస్తారు. ఇంకా మైల, సవల, నెమలిడేగ, కోడి డేగ, గట్టిడేగ, చింతపిక్క రంగుడేగ, కోడినెమలి, నెమలి, కాకి, గట్టికాకి, సుద్దకాకి, కోడికాకి, నెమలి కాకి, కుసునలుపు కాకి, పచ్చకాకి, పూల, సేతువ, తెల్లసేతువ, నల్లబొట్లసేతువ, గేరువ, చిక్కని గేరువ, పండు గేరువ, ఇటుక గేరువ, అబ్రసు, రసంగి, పువల, తెల్లపువల, బోగ, కొత్తబోగ తదితర రకాలున్నాయి.

క్రమపద్ధతిలో ఆహారం, శిక్షణ

పందాలకు పుంజులను సిద్ధం చేసే తీరు ప్రత్యేకంగా ఉంటుంది. వీటికి ఇచ్చే ఆహారం ఖర్చుతో కూడిన వ్యవహారం. జీడిపప్పు, బాదం పిస్తా, ఎండు ఖర్జూరం, కిస్‌మిస్, కోడిగుడ్డులో తెల్లసొన, మేక నల్ల ఇస్తుంటారు. గోధుమలు, దంపుడు బియ్యం, రాగులు, గంట్లు, మినపపప్పు, శెనగపప్పు కలిపిన మిశ్రమం పెట్టి దృఢంగా మారుస్తారు. కొందరు బలానికి టాబ్లెట్లు కూడా వాడుతుంటారు. ఈ పుంజులకు పెట్టే ఆహారానికి అయ్యే ఖర్చు వారానికి రూ.2 వేల వరకు ఉంటుంది. పందాల కోసం కోడిపుంజులకు కఠోర శిక్షణ ఉంటుంది. రోజూ పరిగెత్తించడం, స్విమ్మింగ్, మసాజ్ శిక్షణలో ఓ భాగం. ఉదయాన్నే పరిగెత్తించిన అనంతరం పచ్చి కోడిగుడ్డు తెల్లసొన తినిపించి విశ్రాంతి ఇస్తారు. ఆ తరువాత జీడిపప్పు, బాదంపప్పు, ఎండు ద్రాక్ష, ఎండు ఖర్జూరం, నల్లజీలకర్ర, తెల్ల జీలకర్ర, గసగసాలు దంచిన మిశ్రమాన్ని తినిపిస్తారు. రెండు గంటల పాటు విశ్రాంతి అనంతరం నీటిలో ఈత కొట్టిస్తారు. సాయంత్రం కట్టెల మంటపై మట్టిపిడత వేడి చేసి ఆవేడిని ఓ గుడ్డకు పట్టించి కోడి తలకు, ఒంటికి, కాళ్లకు మసాజ్ చేస్తారు. రాత్రికి మంచి ఆహారం ఇస్తారు. ఏదిఏమైనా కోడి పందాలు, పుంజుల పెంపకం గ్రామీణ సంస్కృతిలో భాగమైపోయింది.

సెల్ ఫోన్ ద్వారానే సైబర్ నేరాలు: సీపీ శంఖబ్రత బాగ్చి


కార్యక్రమంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి, జీవీఎల్ నరసింహరావు, తదితరులు

మద్దిలపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నిత్యం చేతిలో ఉన్న సెల్ ఫోన్ ద్వారానే సైబర్ నేరాలు జరుగుతున్నాయని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జీవీఎల్ మకర సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆదివారం ఆర్థిక నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలియని ఫోన్ నంబర్ల నుంచి వచ్చే సందేశాలను ఓపెన్ చేయడం ద్వారా ఫోన్‌లో ఉన్న బ్యాంక్ ఖాతాల నుంచి నగదును సైబర్ నేరగాళ్లు తస్కరిస్తున్నారన్నారు. వివిధ పద్ధతుల ద్వారా సైబర్ నేరాలు చోటుచేసుకుంటున్నాయని, అందువల్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. లోన్ యాప్‌లలో రుణాలు తీసుకోవాలని ప్రయత్నిస్తే మోసాలు ఎదురవుతాయన్నారు. ఆర్‌బీఐ అనుమతులు ఇచ్చిన యాప్‌లను మాత్రమే ఆర్థిక లావాదేవీలకు వినియోగించాలని సూచించారు. ప్రతీ నేరానికి సెల్ ఫోనే మూలమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పిల్లలు ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడకుండా చూడాలని, ఎవరికీ ఓటీపీలు చెప్పకూడదన్నారు. ఆన్‌లైన్‌లో నగదు మాయమైతే వెంటనే సైబర్ పోలీసులను సంప్రదించాలని, సమయం గడిస్తే ఆ నగదు దేశం దాటిపోతుందని సీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు, రిజర్వ్ బ్యాంక్ అధికారులు బషీర్, రాజేశ్‌కుమార్ మహన, ఎస్‌బీఐ జీఎం రాజేశ్‌కుమార్ పఠాన్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ మైదానంలో సంక్రాంతి శోభ

సంక్రాంతి శోభంతా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో కొలువుదీరింది. పండగలకు పల్లెలు ముస్తాబైనట్టు అక్కడి వాతావరణం నెలకొంది. గంగిఎద్దులు, గుడెసలు, రంగవల్లికలు, చెరకు గడలు, సంప్రదాయ నృత్యాలు, డూడూ బసవన్నలు, హరిదాసులతో పల్లె వాతావరణం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఆయా సెట్‌ల వద్ద సందర్శకులు ఫొటోలు తీసుకుంటూ, ఇన్‌స్టా రీల్స్ చేస్తూ సందడి చేస్తున్నారు. కాగా సాయంత్రం ఏర్పాటు చేసిన మ్యూజికల్ నైట్ అలరించింది.


పల్లె వాతారణాన్ని తలపించేలా వేసిన సెట్

ఉత్సాహంలో బాధ్యతలు మరవద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ద్వారకా సీఐ చక్రధర్

ఎంవీపీ కాలనీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పండగ సందర్భంగా బాధ్యత మరచి ప్రవర్తించవద్దని ద్వారకా నేర విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చక్రధర్ సూచించారు. ఎంవీపీ కాలనీ నేర విభాగం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర వాసులు ఖచ్చితంగా కొన్ని సూచనలు పాటించాలన్నారు. సొంత గ్రామాలకు వెళ్లేవారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. స్టేషన్‌ను సంప్రదిస్తే ఎల్ హెచ్ ఎం ఎస్ కెమెరాలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఇంటి బయట చెత్త, పాల ప్యాకెట్లు, పత్రికలు ఎవరూ తీయకపోతే ఆ ఇంట్లో ఎవరూ లేరని దొంగలు గమనిస్తారని అన్నారు. అందువల్ల వాటిని నిలిపివేయడం లేదా పక్కింటి వారికి చెప్పాలన్నారు. కోడి పందాలు, పేకాట, గుండాటలు నేరమని స్పష్టం చేశారు. భోగి మంటలు వేసేటప్పుడు పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్తు తీగెల కింద, రోడ్లపైన వేయకూడదన్నారు. పర్యావరణం కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భోగి మంటల్లో ఇతర మతాలకు చెందిన వస్తువులు వేయకూడదని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మత్తు పదార్థాలు వినియోగించవద్దని, గాలి పటాలను విద్యుత్తు తీగెలు, రోడ్లకు దూరంగా ఎగరవేసుకోవాలని కోరారు. మెటల్ కోటెడ్ లేదా గాజు కోటెడ్ (చైనా మంజా దారలు) వినియోగించకూడదని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగినట్లైతే 112 లేదా సిటీ పోలీస్ కమిషనర్ 7995095799 నెంబరుకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే తక్షణం సిబ్బంది స్పందించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు రాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

ట్రైనీ ఐఏఎస్‌లకు నగరంపై అవగాహన


జీవీఎంసీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు

వెంకోజీపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీని 42 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఆదివారం సందర్శించారని, కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల పనితీరు, ఇతర వివరాలను వారికి తెలియజేసినట్లు అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి తెలిపారు. తొలుత ఈ బృందం కౌన్సిల్ సమావేశ మందిరం, మేయర్, కమిషనర్ చాంబర్లు పరిశీలించిందన్నారు. నగరంలోని 24 లక్షల జనాభాకు నిత్యం అందిస్తున్న సేవల వివరాలను గణాంక సహితంగా తెలిపారు. జీవీఎంసీ ఆదాయ, వ్యయాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలియజేసినట్లు పేర్కొన్నారు. విశాఖ నగరానికి లభిస్తున్న సింగిల్ డిజిట్ ర్యాంకులు, సాధించిన అవార్డులు, సుందరీకరణకు తీసుకుంటున్న చర్యలను ఈ బృందానికి వివరించామన్నారు. ట్రైనీ ఐఏఎస్‌ల సందేహాలను సంబంధిత అధికారులు నివృత్తి చేశారన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ ఆనంద్, పరిపాలనాధికారి అప్పలనాయుడు, ఎస్ఆర్‌యు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడు ఆదర్శనీయుడు


పేదలకు దుప్పట్లు అందజేస్తున్న సంఘ సభ్యులు

ఆరిలోవ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత వివేకానందుని మార్గంలో నడిస్తే దేశానికి, వ్యక్తిగత జీవితానికి సార్థకత లభిస్తుందని మయూరినగర్ సంఘ సభ్యులు అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆదివారం పార్కులో గల స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంసల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. 12వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గాడి సత్యం, మయూరి నగర్ అధ్యక్షుడు నామాల కృష్ణారావు, కార్యదర్శి కె.వరహాలరావు, విశ్వహిందూ పరిషత్తుకుచెందిన నరసింహనాయుడు, జనసేన నాయకుడు అప్పారావు, పాల్గొన్నారు.

ప్లాంట్‌ను దెబ్బతీయడానికే మిట్టల్ స్టీల్: సీపీఎం


మద్దిలపాలెంలో భోగి మంటలో నేతల ఫ్లెక్సీలు వేస్తున్న నాయకులు

మద్దిలపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీయడానికే మిట్టల్ స్టీల్ తీసుకొస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్కెఎస్వీ కుమార్ ఆరోపించారు. పిఠాపురంకాలనీలో ఆదివారం సీపీఎం నాయకులు భోగిమంటలు వేసి అందులో మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బొమ్మలతో ముద్రించిన ఫ్లెక్సీలు వేశారు.

కుమార్ మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనకే ఇక్కడ మిట్టల్ స్టీల్ పెడుతున్నామనడం బూటకమన్నారు. విశాఖ స్టీల్‌కు సొంత గనులు కేటాయిస్తే మరో పదివేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు యూటర్న్ తీసుకున్నా ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు నోరుమెదపడం లేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారావు, వెంకటరావు, కె.కుమారి, అప్పారావు పాల్గొన్నారు.

'ఉద్యోగుల తొలగింపు చర్యలు తక్షణమే ఆపాలి.'

సిరిపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను బలవంతంగా తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ప్రతిపాదనను తక్షణమే నిలుపుదల చేయాలని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న జేఏసీ దీక్షా శిబిరంలో విశాఖ డెయిరీ ఉద్యోగులు హాజరయ్యారు. ముందుగా కేంద్రంలని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన వీఆర్ఎస్ జీవో కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. మోదీ విశాఖ పర్యటనలో స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం మాట్లాడకపోగా, ఇక్కడ నుంచి వెళ్లిన వెంటనే వీఆర్ఎస్ జీవోను ఆఘమేఘాలపై విడుదల చేయడాన్ని కార్మికవర్గం ముక్తకంఠంతో వ్యతిరేకించాలన్నారు. విశాఖ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.రమణ, అధ్యక్షులు కె.వరహమూర్తి తదితర నాయకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

కోపం, అసహనాన్ని విడనాడాలి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

వెంకోజీపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భగవంతుడు గెలవాలన్నా, రాక్షసుడు ఓడిపోవాలన్నా అందరూ మంచి మార్గంలో పయనించినప్పుడే సాధ్యమవుతుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆదివారం 15వ వార్డు పరిధి ఏపీఎస్ఈబీ కాలనీ ఈస్టు పార్కులో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉంటూ ఏదైనా సాధించవచ్చన్నారు. కోపం, అసహనం వంటి వాటిని అందరూ విడనాడాలని, అందరినీ ప్రేమించినప్పుడే జీవితం సాఫీగా సాగుతుందని పేర్కొన్నారు. సినీ నటుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పోలీస్ శాఖ అంటే తనకెంతో అభిమానమని, అందుకే తనకు పోలీస్ ప్రాతలు లభిస్తే పారితోషకం గురించి ఆలోచించనన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీ రామేశ్వరి మాట్లాడుతూ అందరూ శాంతియుతంగా ఉంటే మనశ్శాంతి లభిస్తుందని, సంక్రాంతి పండగను పాత్రికేయులతో కలిసి జరపడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్టు నాయకుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఏటా పాత్రికేయులమంతా సంక్రాంతి వేడుకను ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. కాలనీలోని మహిళలు ప్రదర్శించిన కోలాటం, థియేటర్ ఆర్ట్స్ విద్యార్థినుల జానపద నృత్యాలు అందరినీ అమితంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో థియేటర్ ఆర్ట్స్ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్, కాలనీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సింహాద్రి రాజు, చైర్మన్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి దుర్ఘటన క్షతగాత్రుల చెక్కులు అందజేత


పల్లా శ్రీనివాసరావుకు చెక్కులు అందజేస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు

గాజువాక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి దుర్ఘటనలో క్షతగాత్రులైన 15 కుటుంబాలకు అందించాల్సిన చెక్కులను టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మీ, జంగా కృష్ణమూర్తి, ఎంఎస్.రాజు, జానకీదేవి, ముని కోటేశ్వరరావు, మహేందర్‌రెడ్డిలు ఆదివారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అందజేశారు. ఉత్తరాంధ్రకు చెందిన 15 మంది క్షతగాత్రులకు ఈ చెక్కులను అందజేయనున్నారు. క్షతగాత్రులకు మానవీయ కోణంలో అండగా నిలుస్తామని వారన్నారు. వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేపాడ చిరంజీవిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన ముగ్గుల పోటీలు

వెంకోజీపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పాత వెంకోజీపాలెంలోని శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం యూత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకదానిని మించి మరొకటి అన్నట్టుగా రంగవల్లులను మహిళలను తీర్చిదిద్దారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మహిళలకు అతిథులు సినీ నటుడు కంచర్ల ఉపేంద్ర, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మొల్లి అప్పారావులు బహుమతులు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న వారందరినీ ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు పల్లా శ్రీనివాస్, పి.వంశీకృష్ణ, పి.ప్రసన్న, పి.శివకుమార్, ఒమ్మి జగ్గారావు, కోటి, తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి నీరాట్టోత్సవం


గోదా అమ్మవారు

ఎంవీపీ కాలనీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయస్వామి వారి ఆలయంలో ధనుర్మాస మహా పర్వదినాల సందర్భంగా ఆదివారం గోదా అమ్మవారికి నీరాట్టోత్సవం నిర్వహించారు. ఆలయం ఆవరణలో భక్తులు దంచిన పసుపుతో గోదా అమ్మవారికి మంగళస్నానం చేయించారు. భోగి రోజున జరిగే గోదా, రంగనాథుల కల్యాణోత్సవానికి ముందుగా ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ సంస్కరణలు భేష్: ప్రణవ్ గోపాల్

సిరిపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లు జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల పాలిట కంస మామలా వ్యవహరించారని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అన్నారు. కనీసం ఉపకార వేతనాలు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారన్నారు. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు తీసుకొని 6.5 లక్షల మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగునింపేలా రూ.788 కోట్ల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ ఇచ్చారన్నారు. గాడి తప్పిన విద్యా వ్యవస్థను సంస్కరణలతో బలోపేతం చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు యావత్ విద్యార్థి లోకం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

ముగిసిన టీడీపీ సభ్యత్వాల సేకరణ


సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

వెంకోజీపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు 15, 16 వార్డుల్లో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ముగిశాయి. 16వ వార్డు అధ్యక్షుడు నారు గోపి ఆధ్వర్యంలో ఇసుకతోట ప్రాంతంలో 350 మందికి సభ్యత్వం ఇచ్చారు. 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ నాయకత్వంలో సుమారు 300 మందికి సభ్యత్వం నమోదు చేయించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

జూ పార్కుకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, జనవరి 12 ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు సందర్శకుల తాకిడి పెరిగింది. సుమారు నాలుగు వేల మంది ఆదివారం సందర్శించారు. వీరి నుంచి సుమారు రూ.3.84 లక్షల ఆదాయం సమకూరినట్లు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

మాతృభాషాభివృద్ధికి ప్రాధికార సంస్థ అవసరం


నిరసన తెలుపుతున్న తెలుగుదండు నిర్వాహకులు

మద్దిలపాలెం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష పరిరక్షణకు స్వయం ప్రతిపత్తి కలిగిన మాతృభాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటు చేయాలని తెలుగుదండు ప్రతినిధి పరవస్తు సూరి డిమాండ్ చేశారు. మద్దిలపాలెం తెలుగు తల్లి విగ్రహం వద్ద ఆదివారం నిరసన గళం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగుభాష రక్షణ కోసం ఏర్పాటు చేసిన అధికార భాషాసంఘం సలహా సంఘంగా మిగిలిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం తెలుగుభాషాభివృద్ధికి నడుం బిగించాలన్నారు. తెలుగులోనే బోధన జరిగేలా చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచార్య అయ్యల ప్రసాదరావు, నాగుల శ్రీనివాస్, చిన్న సూర్యనారాయణ, రాజేశ్, శ్రీధర్, ఆచార్య సూరప్పడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.